www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
06-02-2025
సంపుటి : 01 | సంచిక : 275 | పేజీలు : 12 | వెల : 5/-  తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- 17లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ
- నిర్ణీత కాల వ్యవధిలోనే చెల్లించేందుకు కృత నిశ్చయంతో ఉన్నాం
- ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత రైతులే
- పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రిమంత్రి తుమ్మల

**విశ్వంభర, హైదరాబాద్:** సాగు భూములకు రైతు భరోసా కింద (ఒక ఎకరం వరకు) బుధవారం 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతు భరోసా ప్రారంభించినప్పుడు విడుదల చేసిన నిధులతో కలుపుకొని ఇప్పటివరకు రూ.1,126.54 కోట్లు రైతు భరోసా నిధులు జమ మిగతా2లో...






# క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా

## ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

భవిష్యత్‌లో దేశం తరపున మరింతగా రాణించాలని ఆకాంక్షించిన సీఎం

2

## కుంభమేళాకు మోడీ

- త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం
- గంగానదికి హారతి ఇచ్చి, పూజలు నిర్వహించిన ప్రధాని



2

## తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారు

- హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు
- 18 మందికి మెమోలు జారీ..
- కీలక నిర్ణయం తీసుకున్న టీటీడీ
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఆదేశాలు జారీ



2




# ఢిల్లీ పీఠం బీజేపీదే

దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికలు హోరా హోరీగా సాగాయి. రెండున్నర దశాబ్దాలకు పైగా అధికారానికి దూరంగా ఉన్న కాషాయ పార్టీ.. ఆమ్‌ఆద్మీకి గట్టి పోటీ ఇచ్చింది. మరోసారి అధికారాన్ని కాపాడుకునేందుకు ఆప్ కూడా తీవ్రంగా శ్రమించింది. కాంగ్రెస్ ప్రభావం మాత్రం పెద్దగా కనిపించలేదు. మొత్తంగా ఆప్-భాజపా మధ్య హోరాహోరీగా సాగిన పోరులో బీజేపీ వైపే దిల్లీ ప్రజలు మొగ్గు చూపినట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలుండగా.. మెజార్టీ మార్కు 36. ఆప్ 32 నుంచి 37 స్థానాల్లో గెలుస్తుందని మాట్రిజ్ సంస్థ అంచనా వేయగా.. బీజేపీ 35-40 సీట్లు వస్తాయని తెలిపింది. వీప్రిసైడ్ అనే సంస్థ ఆప్‌కు 46-52, బీజేపీకి 39-45 సీట్లు వస్తాయని పేర్కొంది. ఇలా కొన్ని సర్వేలు మినహా మిగతావన్నీ బీజేపీనే అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి.పోల్ ఆఫ్ పోల్స్‌లో కూడా బీజేపీకే ఆధిక్యం లభించింది.25 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ గెలుస్తుందని మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి.

## ఆప్, బీజేపీ మధ్య టఫ్ ఫైట్

- ఒకటి నుంచి మూడు సీట్లకే కాంగ్రెస్ పరిమితం
- స్పష్టం చేసిన ఎగ్జిట్ పోల్స్..!
- పోల్ ఆఫ్ పోల్స్‌లో కూడా బీజేపీకే ఆధిక్యం
- పోల్స్ అంచనా నిజమైతే 25 ఏళ్ల తరువాత భారతీయ జనతా పార్టీకి దక్కనున్న అధికారం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

దేశ రాజధాని ఢిల్లీలో ఓటింగ్ ముగిసింది. 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు జరిగాయి. . ఓటింగ్ ముగిసిన నేపథ్యంలో పలు సంస్థలను ఎగ్జిట్ పోల్స్ వివరాలను ప్రకటించాయి. ఈ సారి ఢిల్లీ పీఠం బీజేపీదేనని మెజారిటీ సంస్థల ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. జేవీసీ పోల్ బీజేపీకి 39-45, ఆమ్ ఆద్మీ పార్టీకి 32-31, కాంగ్రెస్‌కు 0-2 సీట్లు వస్తాయని అంచనా వేసింది. టైమ్స్ నౌ బీజేపీకి 39-45, ఆప్‌కి 22-31, కాంగ్రెస్‌కు 0-2 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొంది. మ్యాట్రిక్స్ సంస్థ ఆప్‌కు 32-37, బీజేపీకి 35-40, కాంగ్రెస్‌కు 0-1 వస్తాయని అంచనా వేసింది. చాణక్య స్ట్రాటజీ సర్వే ఆప్‌కు 25-28, బీజేపీకి 39,45, కాంగ్రెస్‌కు 2-3 సీట్లు వస్తాయని చెప్పింది. పీపుల్స్ పల్స్ కాంగ్రెస్‌కు ఆప్‌కు 10-19, బీజేపీకి 51-60 వస్తాయని అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ ఆప్‌కు 25-29, బీజేపీకి 40-44, కాంగ్రెస్‌కు 0- ఒక స్థానాల్లో గెలిచే మిగతా2లో...

# ఎల్బీనగర్‌లో విషాదం

- గోడ కూలిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- ఖమ్మం జిల్లా సీతారామపురం తండాకు చెందినవారుగా గుర్తింపు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీ నగర్‌లో గోడ కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.కూలి పని కోసం వచ్చిన కూలీలు సెల్లార్ కోసం గుంతలు తవ్వుతుండగా.. పక్కనే ఉన్న అదే స్థలానికి చెందిన ప్రహరీ గోడ కూలిపోవడంతో ఈ దారుణం జరిగింది. శిథిలాల కింద నలుగురు చిక్కుకోగా.. వారిలో ముగ్గురు చనిపోయారు, ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు , డీఆర్‌ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టాయి. .మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఒకరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.బుధవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. మృతులను వీరయ్య, రాము, వాసుగా గుర్తించారు. దశరథ అనే కార్మికుడికి కాలు విరిగింది. అతడిని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరంతా ఖమ్మం జిల్లా సీతారామపురం తండాకు చెందినవారు.

## కులగణన సర్వే అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్ర



2

- సర్వేలో పాల్గొనని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదు
- బీఆర్ఎస్‌లో మూడు కీలక పదవులు ఒకరికే ఉండటంపై ఎందుకు మాట్లాడరు
- మంత్రి పొన్నం ప్రభాకర్

# కుల గణనతో దేశం చూపు తెలంగాణ వైపు

- సామాజిక న్యాయానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో కుల గణన సర్వే సమాచారం వాడుతాం
- కుల గణనలో పాల్గొనని వాళ్లు మళ్లీ వివరాలు ఇవ్వొచ్చు.
- శాస్త్రీయంగా సర్వే చేసిన అధికార యంత్రాంగానికి అభినందనలు
- త్వరలో పూర్తి రిపోర్టు ప్రజల ముందు ఉంచుతాం
- సచివాలయంలో మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** కులగణన సర్వే విజయవంతంగా పూర్తి చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సామాజిక న్యాయం అమలుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే సమాచారాన్ని ప్రభుత్వ మిగతా2లో...





## ఎస్సీ వర్గీకరణలో లోపాలు సరిదిద్దాలి

- 32 లక్షలు ఉన్న మాదిగలకు 11 శాతం రావాలి
- ప్రభుత్వం ప్రతిపాదించిన నివేదికలో 9శాతం రిజర్వేషన్లే దక్కుతున్నాయి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## అంతేగా!



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 103 | రిటైల్ ₹ 125 |
| స్కిన్ ₹ 181 | స్కిన్ లెస్ ₹ 206 |

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

- అర్హత సాధించిన 42,384 మంది అభ్యర్థులు
- జనవరి 2 నుంచి 20వరకు జరిగిన పరీక్షలు
- స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్ సైట్ నుంచి ఫలితాలు డౌన్ లోడ్ చేసుకోచ్చు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా




2

## ఐటీ చెల్లిస్తే ఫ్రీ రేషన్ కట్..

- అనర్హుల ఏరివేత దిశగా కేంద్రం అడుగులు!
- నిర్ణీత మొత్తం కంటే ఆదాయం కలిగిన వారి డేటాను అందించనున్న డీజీఐటీ సిస్టమ్స్
- అనర్హుల వివరాల గుర్తింపు తర్వాత తదుపరి నిర్ణయం తీసుకోనున్న కేంద్రం



10

# తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారు

**విశ్వంభర, తిరుమల:** తిరుమల పవిత్రతే లక్ష్యం.. భక్తుల మనోభావాలే ముఖ్యం.. అంటూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తోంది.. ఈ క్రమంలోనే.. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. కొండపై అన్యమత ఉద్యోగులపై చర్యలు ప్రారంభించింది. హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూయేతర మత ఆచారాలు పాటించిన వారిపై చర్యలకు టీటీడీ సిద్ధమైంది. 1989 ఎండోమెంట్ యాక్ట్ 1060 మేరకు హిందూమత సంప్రదాయాలను అనుసరిస్తామని ప్రమాణం చేసి టీటీడీలో ఉద్యోగం పొందిన కొందరు అన్యమతాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. వారిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. 18మంది అన్యమత ఉద్యోగులను గుర్తించి వారికి మెమోలివ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హిందూయేతర ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీఆర్ఎస్ తీసుకునే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఈ మేరకు ఆదేశాలు జారీ



చేసింది. గతేడాది నవంబరు 18న టీటీడీ బోర్డు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అన్యమత ఉద్యోగులు**

**తిరుమల పవిత్రను దెబ్బతీస్తున్నారు**

కొంతమంది అన్యమత ఉద్యోగులు తిరుమల పవిత్రను దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ పేర్కొంటోంది.. గత ఏడాది నవంబర్ 18న నిర్ణయించిన తీర్మానం ప్రకారం.. హిందూమత సంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి ఉద్యోగం పొందిన కొందరు... అన్యమతాన్ని ప్రోత్సాహిస్తున్నారంటూ చర్యలు ప్రారంభించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాలతో టీటీడీలో అన్యమత ఉద్యోగులపై చర్యలు ప్రారంభించారు ఉన్నతాధికారులు.. ఇతర మతాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటూనే... టీటీడీ ఉత్సవాల్లోనూ పాల్గొంటున్న 18 మంది ఉద్యోగులపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. 18 మంది అన్యమత ఉద్యోగుల్లో ఎవరైనా తిరుమల, టీటీడీ అనుబంధ ఆలయాల్లో, ఆలయ అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నట్లయితే వెంటనే ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు.సదరు ఉద్యోగులు టీటీడీ ఆలయాల్లో ఉత్సవాలు, ఊరేగింపులు ఇతర హిందూ కార్యక్రమాల విధులకు నియమించకూడదని బీఆర్ నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అన్యమత ఉద్యోగులను ప్రభుత్వ శాఖలకు బదిలీ లేదా విఆర్ఎస్ ఇచ్చి బయటకు పంపాలని టీటీడీ బోర్డు తీర్మానించింది. దీని ప్రకారం.. టీటీడీ అధికారులు 18 మంది ఉద్యోగులకు మెమో జారీ చేశారు.

# ఢిల్లీ పీఠం బీజేపీదే..

**మొదటిపేజీ తరువాయి**

అవకాశాలున్నాయని అంచనా వేశాయి.

70 అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీలో మొత్తం 699 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఈ సారి మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్, బీజేపీకి చెందిన ప్రవేశ్ వర్మ సైతం ఇదే స్థానం నుంచి బరిలోకి దిగారు. ఢిల్లీ సీఎం అతిషి మర్లేనా కల్కాజీ స్థానం నుంచి మళ్లీ బరిలోకి దిగారు. ఈ స్థానం నుంచి బీజేపీ నుంచి రమేశ్ బిధురి పోటీ చేస్తున్నారు.

**2015 ఎగ్జిట్ పోల్స్ ఇలా..**

2015 అసెంబ్లీ ఎన్నికల్లో, ఆరు సర్వే ఏజెన్సీల ఎగ్జిట్ పోల్స్ ఆమ్ ఆద్మీ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందని చెప్పాయి. అయితే, ఏ ఎగ్జిట్ పోల్స్ కూడా ఆప్ కు భారీ విజయాన్ని అంచనా వేయలేకపోయాయి. కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ 45 సీట్లు గెలుచుకుంది. బీజేపీకి 24 సీట్లు, కాంగ్రెస్ కేవలం ఒక సీటు మాత్రమే గెలుస్తుందని అంచనా వేసింది. యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ మాత్రం ఆప్ గరిష్ఠంగా 53 సీట్లు గెలిచింది. ఇండియా టీవీ-సీ ఓటర్ సర్వే కనీసం 35 సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. అయితే, ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ ఎన్నికల్లో ఆప్ 67 సీట్లలో విజయం సాధించింది. బీజేపీకి కేవలం మూడు స్థానాలకు పరిమితమైంది.

**2020లో ఇలా..**

2020లో జరిగిన ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి 62 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీకి ఎనిమిది సీట్లు రాగా, కాంగ్రెస్ ఒక్క స్థానంలోనూ గెలువలేకపోయింది. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం మరోసారి ఫలితాల్లో కనిపించింది. ఎనిమిది సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. అన్ని ఎగ్జిట్ పోల్స్ లో ఆమ్ ఆద్మీ పార్టీ మెజారిటీ సాధిస్తుందని చెప్పాయి. ఢిల్లీ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ వాస్తవ ఫలితాలకు కొద్దిగా దగ్గరా వచ్చాయి. ఆప్ పార్టీ 59-68 సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. ఈ ఎగ్జిట్ పోల్‌లో బీజేపీకి సగటున 15 సీట్లు వస్తాయని అంచనా వేయగా.. ఆ పార్టీకి కేవలం 8 సీట్లు మాత్రమే వచ్చాయి. చాలా సర్వే సంస్థలు కాంగ్రెస్ సున్నా నుంచి ఒక సీటు మాత్రమే వస్తాయని చెప్పగా.. కాంగ్రెస్ ఖాతా సైతం తెరువలేకపోయింది.



తమకు విప్ లు గా అవకాశమిచ్చినందుకు బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపిన మండలి బిఆర్ఎస్ పార్టీ విప్ సత్యవతి రాథోడ్,శాసన సభలో పార్టీ విప్ కె పి వివేకానంద గౌడ్..ఈ సందర్భంగా వారికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.



# కులగణనతో దేశం చూపు తెలంగాణ వైపు




**మొదటిపేజీ తరువాయి**

విధానపరమైన నిర్ణయాలకు, సామాజిక పరంగా తీసుకునే నిర్ణయాలకు తప్పనిసరిగా వాడుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన సర్వే జరుగొద్దని కుట్రదారులు తప్పుడు ప్రచారం చేసి సర్వేలో పాల్గొనద్దని పిలుపు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను అర్థం చేసుకొని సర్వే విజయవంతం కావడానికి ప్రజలు సహకరించి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్న కుల గణన సర్వే పూర్తి చేసి చట్టసభలో ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కులగణన చాలా పారదర్శకంగా, శాస్త్రీయంగా జరిగిందని వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కుల గణన సర్వే మొదలుపెట్టడానికి సుదీర్ఘంగా కసరత్తు చేశామని వివరించారు. 4 ఫిబ్రవరి 2024 న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, 16 ఫిబ్రవరి 2024న అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. 10 అక్టోబర్ 2024 న సర్వే కోసం జీవో విడుదల చేశామన్నారు.సర్వే పర్యవేక్షణకు సీనియర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన 19 అక్టోబర్ 2024 న సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 150 కుటుంబాలతో కూడిన ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి తద్వారా 94,261 బ్లాక్ లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా1, 03, 889 ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చి నిరంతరం ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడం కోసం జిల్లా అడిషనల్ కలెక్టర్లను నోడల్ అధికారిగా నియామకం చేసి, జిల్లా కలెక్టర్ల నిరంతరం పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మానిటరింగ్ చేసి పకడ్బందీగా సర్వే పూర్తి చేశామని వివరించారు.

ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్, ఒక ఎక్సరే లాంటిదన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందన్నారు. గత కులగణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉన్నదని వెల్లడించారు. ఈ కులగణన సర్వే దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న సమస్యల పరిష్కార మార్గం చూపించే ప్రక్రియగా ఉపయోగపడుతుందన్నారు. మరి కొద్ది రోజుల్లోనే మీడియా మిత్రుల సమావేశం నిర్వహించి కుల గణన సర్వేకు సంబంధించిన అంశాలను డిటైల్డ్ గా ప్రజెంటేషన్ చేసి ప్రజల ముందు ఉంచుతామన్నారు. సర్వే సక్సెస్ కావడానికి మెండుగా సహకరించిన ప్రజలకు, మీడియా మిత్రులకు, శాస్త్రీయంగా సర్వే చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పాల్గొన్నారు

## విజయవాడ దుర్గగుడిలో ఐదుగురు ఉద్యోగులపై చర్యలు



**విశ్వంభర, విజయవాడ:** ఇంద్రకీలాద్రిపై వీఐపీ దర్శనాలు చేయించి ఉద్యోగుల సొంత ఖాతాలో నగదు జమ చేసిన విషయంలో ఐదుగురు ఉద్యోగులపై ఈవో చర్యలు తీసుకున్నారు. ఇటీవల తనిఖీల్లో ఒకరిని పట్టుకుని ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్గత విచారణ జరిపి ఇద్దరు శాశ్వత ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు ప్రైవేటు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు జరిపి ఇంకొంతమందిని తొలగించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో రామచంద్ర మోహన్ తెలిపారు.

## ఏపీలో మద్యం అక్రమాలపై సిట్ ఏర్పాటు

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు జరిగిన మద్యం అక్రమాలపై సిట్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో సిట్‌ను నియమించింది. మద్యం అమ్మకాలకు సంబంధించి సిట్‌కు అవసరమైన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. దర్యాప్తు బృందం.. సీఐడీ చీఫ్ ద్వారా ప్రతి 15రోజులకోసారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిట్‌లో సభ్యులుగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ కొల్లి శ్రీనివాస్, సీఐడీ ఏఎస్పీ శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శివాజీని నియమించారు. సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలోనే సిట్ పనిచేస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సిట్ బృందానికి పూర్తి అధికారాలు కల్పించారు. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలకు సంబంధించి రూ.90వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయన్నది అభియోగం. నగదు లావాదేవీలతో పాటు హోలో గ్రామ్‌ల వ్యవహారంలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.



## ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యబీమా పథకం అమలుపై కీలక నిర్ణయం

**విశ్వంభర, అమరావతి:** ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యబీమా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ డీఎంఈ గుర్తించిన ఆసుపత్రుల్లో ఏపీ ఉద్యోగులు చికిత్స పొందేందుకు అనుమతించింది. ఈ మేరకు రిఫరల్ ఆసుపత్రులు గుర్తించాలని ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణలో వైద్యం చేయించుకున్న పలువురు ఏపీ ఉద్యోగులు, పింఛనర్లు... బిల్లులు రీయింబర్స్ కాక నష్టపోయారు. విభజన తర్వాత అనేకమంది ఏపీ ఉద్యోగులు హైదరాబాద్‌లోనే సెటిల్ అయ్యారు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ సంస్థల ఉద్యోగులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి తెలంగాణ డీఎంఈ గుర్తించిన ఆసుపత్రుల్లో ఏపీ ఉద్యోగులు చికిత్స చేయించుకునేందుకు ఆమోదం లభించింది.




## ఏపీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిలిపివేస్తూ ఉత్తర్వులు

**విశ్వంభర, అమరావతి:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ప్రణాళికా విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్టు ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయుష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. తొలుత పార్టీ తరఫున ఈ కార్యక్రమాన్ని చేపట్టిన వైకాపా.. అనంతరం దీన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేసింది. ఎన్నికలకు ఏడాది ముందు ఈ కార్యక్రమాన్ని జగన్ ప్రభుత్వం చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల అనంతరం నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల విభాగం చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కుంభమేళాకు మోడీ..

**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఆయన రుద్రాక్షలు చేతబూని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత గంగానదికి హారతి ఇచ్చి, పూజలు నిర్వహించారు.తొలుత ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని మోడీఅక్కడినుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరించారు. దానికి ముందు అక్కడి బోటులో ప్రయాణించారు. స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు బోటు నుంచే అభివాదం చేశారు. అప్పుడు ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు.

**ఆరేళ్లకే మహా కుంభమేళాలో యోగా**

144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా.. భారత్‌తోపాటు విదేశాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 26 వరకు ఈ వేడుక జరగనుంది. ఇప్పటివరకు పలువురు రాజకీయ, సినీ, వ్యాపారరంగాలతో పాటు పలువురు ప్రముఖులు, సామాన్య పౌరులతో కలిపి 38 కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పుణ్యస్నానమాచరించారు. ఈ చరిత్రాత్మక సమయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తోన్న తరుణంలో ప్రతిఒక్కరూ మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

## కులగణన సర్వే అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్ర

**విశ్వంభర, హైదరాబాద్:** కులగణన జరగకుండా చేయాలని బీఆర్ఎస్ కుట్ర చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బీఆర్ఎస్‌లో మూడు కీలక పదవులు ఒకరికే ఉండటంపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కులగణనలో పాల్గొనని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కులగణన సర్వే ద్వారా బలహీన వర్గాలకు ఒక రోడ్ మ్యాప్ తయారైందని పొన్నం పేర్కొన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలని.. బాధ్యతగా తీసుకొని సరిచేస్తామన్నారు. డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

**మొదటిపేజీ తరువాయి**

చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులకిచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా నిధులను నిర్ణీత కాల వ్యవధిలోనే చెల్లించేందుకు కృత నిశ్చయంతో ఉందన్నారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత రైతులేనని స్పష్టం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తుమ్మల వివరించారు.

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యా విభాగం ఉన్నతాధికారులు సచివాయలంలో ఈ ఫలితాలను విడుదల చేశారు. టెట్ పరీక్ష రాసేందుకు 2,75,753 మంది దరఖాస్తు చేసుకోగా.. జనవరి 2 నుంచి 20వరకు నిర్వహించిన పరీక్షలకు 1,35,802 మంది హాజరైనట్టు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.వీరిలో 42,384 మంది అభ్యర్థులు (31.21 శాతం) అర్హత సాధించారని ప్రకటించింది. మొత్తం రెండు పేపర్లుగా టెట్ పరీక్షలను నిర్వహించారు. అందులో పేపర్ 1.. మొత్తం 8 సెషన్లలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళ్, బెంగాలీ భాషల్లో నిర్వహించారు. ఇక పేపర్ 2.. మొత్తం 12 సెషన్లలో ఏడు భాషల్లో రాసేందుకు అవకాశం కల్పించారు. పరీక్ష పూర్తైన రెండు వారాల్లోనే ఫలితాలను ప్రకటించిన పాఠశాల విద్యాశాఖ... అభ్యర్థులు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్ సైట్ నుంచి ఫలితాలు డౌన్ లోడ్ చేసుకోచ్చని తెలిపింది.

## ఎస్సీ వర్గీకరణలో లోపాలు సరిదిద్దాలి

**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని.. మాదిగల జనాభాకు తగ్గట్లుగానే రిజర్వేషన్ల వాటా ఉండాలని విన్నవించామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నివేదికలో 9శాతం రిజర్వేషన్లే దక్కుతున్నాయన్నారు.''15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. 32 లక్షలు ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్ల పంపిణీలో లోపాలను సరిదిద్దాలి. మాకు రావాల్సిన దానికంటే 2 శాతం తక్కువ ఉన్నాయి'' అని మందకృష్ణ మాదిగ అన్నారు.

## క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా..

**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని భారత మహిళా క్రికెటర్ గొంగడి త్రిషమర్యాదపూర్వకంగా కలిశారు. ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 ప్రపంచకప్ టీమ్‌లో మరో సభ్యురాలు ధ్రుతి కేసరి, టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. త్రిషను సత్కరించిన సీఎం.. భవిష్యత్‌లో దేశం తరఫున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభం నుంచి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో త్రిష అదరగొట్టింది. టీమ్‌ఇండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.

## హరీశ్‌రావును ఈనెల 12 వరకు అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావును ఈనెల 12 వరకు అరెస్టు చేయొద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును క్వాష్ చేయాలని హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హరీశ్‌రావును అరెస్టు చేయొద్దన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన న్యాయస్థానం.. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది.





# దేశప్రజలు మెచ్చిన మోడీ సర్కార్ వికసిత్ భారత్

**విశ్వంభర, బొంగుళూరు:** 12 లక్షల వరకు ఆదాయం పై పన్ను మినహాయింపు ప్రకటన చేయడం పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లకు ఆదిభట్ల మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బొంగులూరు చౌరస్తా లో పాలాభిషేకం నిర్వహించారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ జిల్లా ఇన్చార్జి, నిట్టు శ్రీశైలం మాట్లాడుతూ మోదీ పాలనలోనే ఆదాయపు పన్ను పై అత్యంత అధిక మినహాయింపు పరిమితులు ఇవ్వబడ్డాయని అన్నారు. మొదటి నుండి మధ్య తరగతి ప్రజల ప్రగతికి పాటుపడిన ఏకైక ప్రధాని మన నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు.

మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూసిన కల నెరవేరిందని మోదీ నాయకత్వంలో రూపొందించిన బడ్జెట్ 2025 - 26తో మధ్యతరగతి కుటుంబాలపై, ఉద్యోగులపై ఉన్న పన్ను భారాన్ని తగ్గించింది. 12 లక్షల వరకు ఆదాయం పై పన్ను మినహాయింపు ప్రకటనతో కొన్ని కోట్ల మంది ప్రజలు సంబరాలు చేసుకోవడానికి కారణమైన ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రులకు ప్రజలందరి తరపున హార్దిక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, ఆదిభట్ల మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్, బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పొట్టి శ్రీరాములు, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్, యలిగపల్లి నారాయణ యాదవ్, బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్ గౌడ్, అశోక్ గౌడ్, మనోహర్ లాల్, శ్రీదేవి, భవాని దేవదాస్, గజ్జల వెంకటరెడ్డి బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అజయ్ కుటుంబానికి ఆర్థిక సాయం

- కుటుంబానికి అన్ని విధాలుగా తోడుంటా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర, నాగారం:** భారతమాత మహాహారతి కార్యక్రమంలో హుస్సేన్ సాగర్ లో గల్లంతై మరణించిన చిలివేరి అజయ్ కుటుంబాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాగారంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తండ్రి చిలివేరి రాములు కు ధైర్యం చెప్తూ కుటుంబంలో ఒకరికి ఉపాధి (ఉద్యోగం) కల్పిస్తామని హామీ ఇచ్చారు. భాదిత కుటుంబానికిఅన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. కుటుంబానికి 20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఆర్థిక సహాయం అందించడానికి, మంత్రిని నాగారం తీసుకురావడానికి ప్రముఖ పాత్ర పోషించిన గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్ రావు , చిక్క దేవదాస్, నాగారం మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డికి నాగారం పద్మశాలి సంక్షేమ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## అఫ్జల్ గంజ్ కాల్పుల కేసు.. నిందితుల కోసం గాలిస్తున్నాం: డీసీపీ

**విశ్వంభర, హైదరాబాద్:** అఫ్జల్ గంజ్ కాల్పుల కేసులో నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ సుధీంద్ర తెలిపారు. సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారని చెప్పారు. బీదర్, అఫ్జల్ గంజ్‌లో కాల్పులు జరిపిన నిందితులు బిహార్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. నిందితులు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ తరహా నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు. ''అక్రమ ఆయుధాల వినియోగంపై నిఘా కొనసాగుతోంది. ఆయుధాలకు సంబంధించి గడువు ముగిసినప్పటికీ లైసెన్సులు రెన్యువల్ చేసుకోని పక్షంలో చర్యలు తప్పవు. లైసెన్సు లేకుండా అక్రమంగా ఆయుధాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం'' అని హెచ్చరించారు.

# బీసీ కులగణనపై బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

- బీసీలకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ పార్టీ వాకౌట్ చేసి బీసీలను అవమానించింది
- కులగణన రాహుల్ ఆలోచన.. సీఎం రేవంత్ రెడ్డి ఆచరణ
- గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ




**విశ్వంభర,హైదరాబాద్:** ఎన్నో ఏండ్లుగా అన్యాయానికి గురవుతున్న రాష్ట్రంలోని 56 శాతం బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని సంకల్పించిందని, బీసీ కుల గణనపై జరిగే కుట్రలను తిప్పి కొట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదని, అసెంబ్లీలో, శాసన మండలిలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి బీసీలను అవమానించారని మండిపడ్డారు. కులగణన రాహుల్ గాంధీ ఆలోచన అని, దాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆచరణలో సాధ్యం చేసి చరిత్రను సృష్టించారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వే - 2024 ప్రకటన ఇటీవల ప్రవేశపెట్టిన సందర్భంగా పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకరయ్య, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషంతో కలిసి గాంధీ భవన్ లో కొండా సురేఖ విలేకరుల సమావేశం లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని దశాబ్ధాలుగా రాష్ట్రంలో బీసీల సంఖ్య పెరుగుతున్నా, సామాజిక న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యను తీర్చేందుకే తమ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బీసీల కుల గణన చేపట్టినట్టు చెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనతో కుల గణన చేశామన్నారు. కుల గణనకి సంబంధించిన స్టేట్ మెంట్ మీదనే అసెంబ్లీ, శాసనమండలిలో తమ ప్రభుత్వం డిస్కసన్‌కు అనుమతి ఇచ్చినట్టు చెప్పాఆరు. ఇంత కీలకమైన అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ చట్టసభ సభ్యులు సమావేశాల మధ్యలోనే వెళ్లిపోవడంతో సరికాదు అన్నారు. ఈ చర్య ద్వారా వారికి బీసీలపై ప్రేమ ఎంత ఉందో అర్థం అవుతుందని సురేఖ గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీల కోసం ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. కనీసం వారు చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ అయినా బయట పెట్టారా? అని నిలదీశారు. తమ ప్రభుత్వం బీసీల కోసం చేస్తున్న కృషిని పక్కదారి పట్టించేందుకు, బీఆర్ఎస్ తన సోషల్ మీడియా వేదికల ద్వారా కుల గణన పై నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, కుల గణన అమలును అడ్డుకుంటే బీసీలకే నష్టమని సురేఖ అభిప్రాయపడ్డారు. తాను రెండు కులాల ప్రతినిధిగా చెప్తున్నానని, కుల గణన ఒక చరిత్ర అని కొండా సురేఖ వ్యాఖ్యానించారు.

# "దేశంలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయం కుల గణన"

## బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**విశ్వంభర,హైదరాబాద్:** తెలంగాణ చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) దేశంలోనే ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం అని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా పూర్తి చేసిన సామాజిక, ఆర్థిక ,విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) ఒక చారిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే బలహీన వర్గాల జనాభా గణాంకాలపై చర్యలు చేపట్టడం ఆనందకరమని ఈ సర్వే నివేదికకు పూర్తి చట్టబద్ధత కల్పించాలని ఉద్దేశంతో కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రిమండలి అమల్లోకి తెచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 6 నవంబర్ 2024న సర్వే ప్రారంభించగా 25 డిసెంబర్ 2024 నాటికి పూర్తి అయ్యిందని 50 రోజులు సర్వే ముగిసిన సమయానికి మొత్తం కుటుంబాల సంఖ్య గ్రామీణ ప్రాంతాలలో 66,99,602 గా తేలిందని నగర ప్రాంతాలలో ఆ సంఖ్య 45,15,532 గా ఉందని మొత్తం 1,12,15,137 కుటుంబాలు అంటే 96.09% గా ఉందని సరిగ్గా ఏడాది కాలంలో పూర్తి చేసిన నివేదిక ప్రజల ముందు ఉంచడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46.25% ఉన్న బీసీలు మైనార్టీలలోని బీసీలు కలుపుకొని 56.33% ఉండడం బీసీలందరికీ సమాజంలో సముచితమైన గౌరవ స్థానం కల్పించాలన్న ఆలోచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

**పకడ్బందీగా అమలు..**

ఇతర రాష్ట్రాలలో ఇలాంటి ప్రక్రియ న్యాయస్థానాల ముందు నిలవకపోవడంతో అలాంటి తప్పిదం జరగకుండా సర్వే పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకున్నారని, అందుకు బీసీ సామాజిక వర్గాలకు న్యాయం జరగాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా గత 75 సంవత్సరాలలో ఎన్నో వినతులు వచ్చిన బలహీనవర్గాలు, ఇతర కులాలు, ఉపకులాలకు, సంబంధించిన వివరాలు సేకరించబడలేదని అందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం వర్గీకరణ అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలబడడం ఆనందదాయకమని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని షెడ్యూలు కులాలలో సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మాదిగ ఉపకులాలు తొమ్మిది శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందని మాల ఉపకులాలను ఐదు శాతంగా అత్యంత వెనుకబడిన బుడగ జంగాలు తదితర కులాలకు ఒక శాతం రిజర్వేషన్ కేటాయించిందని ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులతో పాటు ఇతర మైనార్టీ వర్గాలకు మేలు జరిగే అవకాశం ఉందని దీనితో విద్య, ఉద్యోగం, రాజకీయం, అని తేడా లేకుండా అన్ని రంగాలలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లను స్వాగతిస్తున్నామని అన్నారు. బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా ఈ ఆనందాన్ని మా బీసీ సామాజిక వర్గంతో పంచుకునేందుకు ఆనందపడుతున్నానని శ్రీకాంత్ అన్నారు.

## నూతన సీఐకు శుభాకాంక్షలు తెలిపిన గ్లోబల్ నావిగేటర్స్ సంస్థ నిర్వాహకులు



**విశ్వంభర, హైద్రాబాద్:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నియమితులైన సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డిని గ్లోబల్ నావిగేటర్స్ ఎండి మారెడ్డి రాజ శేఖర్ రెడ్డి, మారెడ్డి అమర్ కుమార్, మారెడ్డి శ్రీనాథ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు సాయిలు, హనుమాన్ నాయక్ లు పాల్గొన్నారు.

## తను నా 'సీరియస్ గర్ల్‌ఫ్రెండ్'..

### పౌలా హర్డ్‌తో రిలేషన్‌షిప్‌పై బిల్ గేట్స్ కామెంట్స్

**వాషింగ్టన్:** అపర కుబేరుడైన వ్యాపారవేత్త, మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకులు బిల్ గేట్స్ ప్రేమలో పడ్డట్లు గత కొంత కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. 62 ఏళ్ల పౌలా హర్డ్‌తో బిల్‌గేట్స్ డేటింగ్‌లో ఉన్నారంటూ తెగ ప్రచారం జరుగుతోంది. 2023లో ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ, గతేడాది జరిగిన ఒలింపిక్స్, ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ ప్రీవెడ్డింగ్ వేడుకలు సహా పలు ఈవెంట్స్‌లో ఇద్దరూ జంటగా దర్శనమిచ్చారు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ అంతా మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పౌలా హర్డ్‌తో రిలేషన్‌షిప్‌పై బిల్‌గేట్స్ తాజాగా స్పందించారు. ఆమెను తన 'సీరియస్ గర్ల్‌ఫ్రెండ్'గా అభివర్ణించారు. 'పౌలా అనే సీరియస్ గర్ల్‌ఫ్రెండ్‌ను కలిగి ఉండటం నా అదృష్టం' అని బిల్ గేట్స్ పేర్కొన్నారు. తామిద్దరం చాలా సరదాగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాగా, బిల్ గేట్స్ ప్రేమలో పడ్డట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. పౌలా హర్డ్ తో గత కొంతకాలంగా రిలేషన్‌లో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. 2023 జనవరిలో ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ సందర్భంగా వీరిద్దరూ కలిసే కనిపించారు. ఇద్దరూ పక్కపక్కనే కూర్చొని మ్యాచ్‌ను వీక్షించారు కూడా. ఆ సమయంలో ఇద్దరూ చాలా చనువుగా కనిపించడంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత కూడా చాలా సందర్భాల్లో వీరిద్దరూ జంటగా దర్శనమిచ్చారు. బిల్ గేట్స్-పౌలా రొమాంటిక్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని.. వారిది విడదీయలేని బంధం అని వారిద్దరికీ అత్యంత సన్నిహితుడైన ఓ వ్యక్తి తెలిపారు. దీంతో వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, ఈ వార్తలపై ఈ జంట ఇప్పటి వరకూ బహిరంగంగా స్పందించలేదు. ఈ క్రమంలో బిల్ గేట్స్ తాజా కామెంట్స్‌తో మరోసారి వీరి రిలేషన్‌షిప్ హాట్‌టాపిక్ అవుతోంది.

**ఎవరీ పౌలా హర్డ్..**

టెక్ దిగ్గజం ఒరాకిల్ మాజీ సీఈవో మార్క్ హర్డ్భార్యనే ఈ పౌలా హర్డ్. క్యాన్సర్‌తో చాలాకాలం పోరాడిన మార్క్ 2019లో మరణించారు. పౌలా హర్డ్ టెక్ ఎగ్జిక్యూటివ్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం ఆమె ఈవెంట్ ప్లానర్‌గా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమె చాలా చురుకుగా ఉంటున్నారట.దాదాపు మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ 2021లో విడాకులు తీసుకున్నారు బిల్ గేట్స్-మెలిందా దంపతులు. ఈ ఇద్దరూ 1994లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఏమైందో ఏమోకానీ పెళ్లైన 27 ఏళ్ల తరువాత విడిపోయారు. టాక్స్ ఎగ్గొట్టడం కోసమే విడాకులు తీసుకున్నారంటూ వీళ్లు విడిపోయినపుడు రకరకాల రూమర్స్ వచ్చాయి. విడాకుల అనంతరం మెలిందా సైతం ప్రేమలో పడ్డట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. మాజీ టీవీ రిపోర్టర్ జాన్ డ్యూ ప్రీతో డేటింగ్ చేస్తున్నట్టు ఒక ఆన్‌లైన్ టాబ్లాయిడ్ రిపోర్టు చేసింది. గత కొన్ని నెలలుగా వీరిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు సంబంధిత వర్గాలు చెప్పినట్టు ఆ రిపోర్టు పేర్కొంది. కాగా, బిల్ గేట్స్‌తో విడిపోయిన తర్వాత తాను భరించలేని వేదనకు గురైనట్టు మెలిందా గేట్స్ ఓ ఇంగ్లీష్ మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.



# ఉమ్మడి పాలమూరు జిల్లా నీటి అవసరాలు తీర్చండి

- నారాయణపూర్ ప్రాజెక్ట్ నుంచి జూరాలకు నీటి విడుదల చేయండి
- కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్ కు మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు విజ్ఞప్తి
- నీటి విడుదలకు సానుకూలంగా స్పందించిన డీకే
- నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 4 టీఎంసీలు విడుదల చేస్తామని హామీనిచ్చిన డీకే





**విశ్వంభర,బెంగళూర్:**

కర్నాటకలోని నారాయణపూర్ డ్యాం నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసి ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దారామయ్యను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. సీయం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ .. మంగళవారం బెంగళూర్ లో సీయం సిద్దారామయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్ ను కలిసి .. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వేగంగా అడుగంటుతోందని, రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గిపోయి నీటిమట్టం పడిపోతోందని వారికి వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు, ప్రజలకు సాగు,తాగునీరు అందించే జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం నిరాశాజనకంగా ఉందని,ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ ప్రాంతం తీవ్రంగా సాగు, తాగునీటి కొరతను ఎదుర్కొంటోందని, దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ఫిబ్రవరి 4, 2025 నాటికి నీటి నిల్వ తీవ్రంగా తగ్గిపోయి కేవలం 1.7 టీఎంసీకి చేరిందని, పరిస్థితి ఇలాగే సాగితే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి పడిపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తాగునీటి సరఫరా, పంటలకు అవసరమైన సాగునీటి అవసరాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడిందని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొని ఉందని, లక్షలాది మంది రైతుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని నీటి సంక్షోభంపై వారికి వివరించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయిని అని, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, భీమా ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులకు నీటిని అందిస్తూ సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా సుమారు 2.5 లక్షల ఎకరాల వ్యవసాయ భూమికి నీరు అందుతోందని, ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి నిల్వల తగ్గుదల కారణంగా ప్రస్తుత పంటలకు కనీసం రెండు తడులు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతేకాక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 30 లక్షల మంది ప్రజలు తాగునీటి కోసం పూర్తిగా ఈ నీటి వనరుపైనే ఆధారపడి ఉన్నారని, నీటి నిల్వలు తగ్గుతుండటంతో గద్వాల్, వనపర్తి, కొల్లాపూర్, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో తీవ్ర నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు ఈ ప్రాంతానికి తక్షణమే నీటి విడుదల జరగకపోతే, పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారని, అదేవిధంగా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చి ప్రజల దాహార్తిని తీర్చడం కష్టంగా మారనుందని వివరించారు.

ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాలని, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తక్షణమే 5 టీఎంసీల నీటిని విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, డిప్యూటీ సీయంకు మంత్రి జూపల్లి విజ్ఞప్తి చేశారు. నీటిని విడుదల చేయడం వల్ల తాగునీటి కష్టాలు తీరుతాయని, యాసంగి పంటలకు కూడా ఢోకా ఉండదని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీకే శివకుమార్.. 4 టీఎంసీల నీటి విడుదల చేస్తామని భరోసానిచ్చినట్లు మంత్రుల బృందం తెలిపింది.

# పరశురాముడు ప్రతిష్టించిన చిట్టచివరి శివలింగం!!

## అంగరంగ వైభవంగా కొనసాగుతున్న చెరువుగట్టు బ్రహ్మోత్సవాలు






నల్గొండ జిల్లాలో అతిపురాతనమైన ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన ఆలయం చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామి వారి ఆలయం. పరశురాముడు ఈ శివలింగాన్ని ప్రతిష్టించినట్లు ప్రతీతి. క్షత్రియ సంహారానంతరం, తన పాప ప్రక్షాళన కోసం పరశురాముడు 108 శివలింగాలను ప్రతిష్టించాడనీ, ఆయన ప్రతిష్టించిన 108 శివలింగాలలో చివరి లింగం జడల రామలింగేశ్వర స్వామిదని స్థలపురాణం.
నల్గొండ జిల్లా నార్కట్ మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఎల్లారెడ్డి గూడెం అనే అందమైన గ్రామంలో ఈ ఆలయం వెలసింది. ఆ గ్రామానికి తూర్పు వైపున ఒక చెరువు, ఆ చెరువు గట్టున పార్వతీ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయం ఉంది. ఆ దేవాలయానికి పశ్చిమాన గల కొండపై శ్రీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ క్షేత్రం నల్గొండకు 14 కిలో మీటర్ల దూరంలో, అద్దంకి నార్కట్ పల్లి ప్రధాన రహదారికి ఒక కిలో మీటరు దూరంలో ఉంది.
స్థలపురాణం: పూర్వం హైహయ వంశ మూలపురుషుడు, కార్త వీర్జార్జున చక్రవర్తి సపరివారంగా వేటకోసం దండకారణ్యానికి బయలుదేరాడు. అవిశ్రాంతంగా వేటాడిన పిదప బడలికకు గురైన చక్రవర్తి, సపరివారంగా సమీపంలోని జమదగ్ని ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పుడు జమదగ్ని మహర్షి తన దగ్గరున్న ధేనువు సాయంతో క్షణాలతో వేలాది సంఖ్యలలో ఉన్న రాజ పరివారానికి షడ్రసోపేతమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేసాడు. ఆ ధేనువు మహత్తును మహర్షి దగ్గర అడిగి తెలుసుకున్న కార్తవీర్యార్జునుడు తనకు ఆ ధేనువు కావాలని అడుగుతాడు.
అందుకు మహర్షి తిరస్కరించడంతో కుపితుడైన కార్తవీర్యార్జునుడు, జమదగ్నిని సంహరించి ధేనువును తీసుకుని వెళతాడు. ఆ సమయంలో పరశురాముడు బయటకు వెళ్ళి, తిరిగి పరశువుతో (దొడ్డలి) కార్త వీర్యార్జుని సంహరించి, ఇరవై ఒక్కసార్లు భూ ప్రదక్షిణం చేసి క్షత్రియ సంహారం చేస్తాడు.
క్షత్రియ వధానంతరం, తాను చేసిన పాప పరిహారార్థం దేశం నలుమూలలా 108 శివలింగాలను ప్రతిష్టించి, ఒక్కొక్క లింగం చెంత వేలాది సంవత్సరాలు తపస్సు చేసి, ఆ తపోఫలాన్ని, ఆ క్షేత్రానికి ధారపోసి, మానవ కళ్యాణానికి పాటుబడ్డాడు. అలా ప్రతిష్టించిన శివలింగాలలో చిట్టచివరిదైన 108వ శివలింగం ఈ చెర్వుగట్టు క్షేత్రంలోని జడల రామలింగేశ్వరుడు. ఈ ప్రదేశంలో పరశురాముడు శివుని వేడుతూ.. ఎంతకాలం తపస్సు చేసినప్పటికీ శివుడు ప్రత్యక్షం కాకపోవడంతో, కోపగించుకున్న పరశురాముడు తన గడ్డలితో శివలింగం ఊర్ధ్వభాగంపై ఒక దెబ్బ వేశాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై, ఇంత కాలం నువ్వు తపస్సు చేసిన ప్రాంతం, ప్రముఖ శైవ త్రేక్రంగా వెలుగొందుతుందని, కలియుగాంతం వరకు తానిక్కడే ఉండి భక్తులకు అనుగ్రహిస్తుంటానని చెప్పాడు.
అనంతరం పరశురాముడు కూడ ఇక్కడే లింగాకృతిని పొంది శివసాయుజ్యాన్ని పొందాడట. పరశురాముని ఆత్మలింగము జడల రామలింగేశ్వరాలయానికి దరిదాపుల్లో వేరొక గుహలో ఉంది. రామలింగేశ్వరుని ఊర్ధ్వభాగాన పరశురాముడు గండ్ర గొడ్డలితో దెబ్బవేసిన చోట జడల వంటి నిర్మాణాలు ఉన్నాయి. అందుకనే స్వామిని జడలరామలింగేశ్వర స్వామి అని అంటారు. కొండపై గుహలోగల జడల రామలింగేశ్వరునికి 12వ శతాబ్ధానికి చెందిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి గుహాలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయంలో తొలి ఏకాదశినాడు, కార్తీక సోమవారాల్లో, పౌర్ణమి, మహాశివరాత్రి పర్వదినాలలో కడువైభవంగా ఉత్సవాలు జరుగుతుంటాయి.
ఇది హైదరాబాద్- నల్లగొండ రహదారిపై నార్కెట్ పల్లి నుండి 6 కి.మీ దూరంలో ఉన్నది. ఎల్లారెడ్డిగూడెం మెయిన్ రోడ్ నుండి కొండపైకి వెళ్ళడానికి మార్గం కలదు నల్లగొండ మరియు నార్కెట్ పల్లి నుండి ఎల్లారెడ్డిగూడెం మెయిన్ రోడ్ వరకు బస్సు సౌకర్యం కలదు. అక్కడి నుండి కొండపైకి వెళ్ళడానికి ఆటోలు లభిస్తాయి.



## పుణ్యాత్ములు మాత్రమే ఈ మార్గం దాటి స్వామివారిని దర్శించుకోగలరు

మనిషి పట్టలేనంత చిన్న సందు ఉన్న బండరాళ్లు అవి. కానీ వాటిల్లోంచి ఎంతటి లావు వ్యక్తులైన బయటకు వెళ్లగలుగుతారు. అణువణువునా భయాన్ని పుట్టించే ఆ మార్గం గుండా వెళ్ళి.. మూడు గుండ్లపై వెలిసిన దేవుణ్ని దర్శించుకుంటారు. పరుశరాముడు ప్రతిష్టించిన చివరి లింగంగా చెప్పుకునే ఈచెర్వుగట్టు క్షేత్రంలో మూడు గుండ్లకు విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. అన్ని ఆలయాల్లో మాదిరిగా ఇక్కడి దేవుణ్ని సునాయసంగా చూడలేం. కొండపైన భాగాన ఉన్న దైవాన్ని దర్శించుకోవాలంటే రాతి బండల సందుల్లోంచి దూసుకెళ్తేనే దైవదర్శనం కల్గుతుంది. దారి మొత్తం ఇరుకైన రాళ్ల సందులోంచే సాగుతుంది. ఒక దగ్గర మాత్రం మరీ ఇబ్బందికరంగా ...రెండు బండల మధ్య అతి తక్కువ ఖాళీ ప్రదేశం ఉంటుంది. దానిలోంచి అడ్డంగా ప్రయాణిస్తేనే అవతలి వైపుకుప్రవేశం. నామాల ఆకారంలో ఉండే వీటిపైన వెలిసిన దైవాన్ని ప్రార్థిస్తే సకల పాపాలు తొలగి పోతాయని భక్తుల విశ్వాసం. ఈ బండరాళ్ల మధ్య దూరం చాలా తక్కువగా ఉండడంతో దీనిలోంచి వెళ్లడానికి చాలా మంది భయపడుతుంటారు. కొందరు మాత్రం భారీ శరీరాలున్నా ఈజీగా బయటకు వెళ్తారు. వెళ్లలేని వాళ్లు దైవం కరుణించలేదని వెనక్కి తిరిగి వెళ్తారు. ఇక్కడి దైవ దర్శనం కేవలం పుణ్యాత్ములకు మాత్రమే దక్కుతుందని భక్తులు నమ్ముతారు. పాపాలు చేసిన వారికి ఇక్కడ స్వామి వారు దర్శన భాగ్యం ఇవ్వకుండా మూడు గుండ్ల నుంచే వెనక్కి పంపుతారని భక్తులు విశ్వసిస్తున్నారు. బండరాళ్ల మధ్య నుండి అతికష్టం మీద పైకి చేరిన వాళ్లంతా దేవుణ్ని మనసారా ప్రార్థించి కిందికి వెళ్తారు. ఇక్కడి గుట్టపైకి మెట్ల మార్గం ద్వారా వెళ్లడం పుణ్యమేనని మరికొందరి నమ్మకం.ఈ చెర్వుగట్టు దేవాలయం శివ భక్తులకు చిరపరిచితమైన పుణ్యక్షేత్రం. నిత్యం వేలాది మంది ఇక్కడి దైవాన్ని దర్శించుకుంటారు.అమావాస్య రోజున స్వామి వారి సన్నిధిలో నిద్రిస్తే అన్ని రోగాలు పోతాయని భక్తుల విశ్వాసం.

# నింద ఎరుగని నిశ్శబ్ద గోసకు ఆచూకి




### "సడిలేని గోస" దీర్ఘ కవిత

**"బతుకు బాంధవ్య మధురిమను**
**ఎడబాయనొల్లని ఒకానొక**
**దుఃఖితుడు...."**

నిండైన జీవితానుభవం కలిగిన ఈ కవితాత్మక వాక్యాలు ప్రతీ ఒక్కరి జీవితానికీ వర్తించేవి. ఈ కవితాత్మక వాక్యాలకు చిరునామా బైరెడ్డి కృష్ణారెడ్డి. తెలుగు సాహిత్యంలో పరిచయం అక్కర్లేని ఆర్తి కవి. బి. నర్సింగరావు అన్నట్టు "బైరెడ్డి కృష్ణారెడ్డి ఎంతో భావుకుడు. మరెంతో నిష్కపటి." ఆయనను దగ్గరగా చూసినపుడు, జీవితాన్ని మనసు తడితో తడిమిచూసుకునే అరుదైన సంపూర్ణ అంతరంగిక వ్యక్తిగా కనిపిస్తారు. భావోద్వేగాలు జీవ లక్షణం. ఆయన కవిత్వంలో వైయుక్తిక భావోద్వేగాలు ప్రకటించినా, అవి సార్వత్రికంగా ప్రదర్శితమవుతాయి. మనసు ఆర్తిని విశాలంగా, విస్తారంగా చూసిన కవి కన్నులు ఇప్పుడు "సడిలేని గోస" దీర్ఘ కవిత రూపంలో ఒక నాయిన దైన్యాన్ని పరికించాయి. ఈ దీర్ఘ కవిత బైరెడ్డి సతీష్ రెడ్డి తండ్రి గారికి చెందిన ఒక ఎలీజి. దీనిలో కవి బాధ, ఒక తండ్రి బాధ ప్రత్యక్షంగా, పరోక్షంగా పరస్పరం మారుతూ పాఠకుని హృదయానికి నేరుగా తాకుతూ ఉంటుంది. ఈ దీర్ఘకవిత నిండా నాయిన బాధను విస్తరించినా, మానవ సంబంధాలను మరింత లోతుగా, సహజంగా చిత్రించాడు.
ఈ దీర్ఘ కవితలో కవి బైరెడ్డి కృష్ణారెడ్డి వ్యక్తపరిచిన కవిత్వ విధానము, కవితాత్మకత భిన్నమైనవి. మరణశయ్యపైనున్న తల్లి తారకమ్మ తుది ఘడియలు మరియు ఆమె మరణం సందర్భంగా తండ్రి బైరెడ్డి యేసిరెడ్డి పడిన దుర్లభమగు బాధ ఆచూకీని ఇంత ఆర్తితో తెలుగు సాహిత్యంలో మునుపు ఎవ్వరూ చిత్రించలేదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. కవిత్వ రచన వైయుక్తికం. కవిత్వం సమాజానికి సొంతం. సంతోషం గురించి ఎందరు రాసినా, దుఃఖం గురించి కవులు రాయడం చాలా ముఖ్యమైనది. సుఖ, దుఃఖాలకు సమప్రాధాన్యత ఉండొచ్చు గాక. మానవ అనుబంధాలకు హేతువు ముమ్మాటికి దుఃఖమే. కాబట్టి మానవత్వపు పరిమళాలు వికసించాలంటే కవికి దుఃఖం రాయడం తప్పనిసరి. అటువంటి దుఃఖం గురించి రాసినా, చదివినా ఆ నిర్భేద్య దుఃఖం నుండి అవలీలగా బయటపడగలమని ఈ కావ్యం ద్వారా బైరెడ్డి నిరూపించారు. యాదృశ్చికంగా నాకు నాయిన దూరమయ్యాక చదివిన మొదటి పుస్తకం ఇది. మొదటి పుస్తకావిష్కరణ ఇది. నా దుఃఖం నాయినకు చెందినది. ఇది కవి మిత్రుడు సతీష్ గారి దుఃఖం అమ్మది. నాయిన తరపునది. నేను నాయిన దూరమైన దుఃఖం నుండి బయటపడడానికి ఈ గ్రంథం ఉపయోగపడే వాసనలున్నాయి అని నమ్మినాకనే ఈ వాక్యాలు రాస్తున్నాను. ఏ సాహిత్యానికైనా ఆర్తి స్పర్శ తగిలినపుడు అది శాశ్వతత్వం సంపాదించుకుంటుంది. ఆ విధంగా "ఆర్తి"లాగే, ఈ "సడిలేని గోస" కూడా శిలాక్షరమే అవుతుంది.
ఈ దీర్ఘకవితకు "సడిలేని గోస" అనే శీర్షిక సరిగ్గా కుదిరింది. "సడి" అంటే "నింద, అపకీర్తి" అని డిక్షనరీ అర్థం. బ్రౌణ్య నిఘంటువు ప్రకారం "ఆచూకీ"(A Trace) అనే అర్థం కూడా ఉంది. సడీసప్పుడు అనే జంటపదంలో భాగంగా మనం "సడి" అనే పదాన్ని విరివిగా వినియోగిస్తాం. చరమకాలంలో ఉన్న జీవిత భాగస్వామి అనారోగ్యంతో మంచానపడినపుడు, ఆమె జీవితం ముగిసిపోతున్నపుడు, ఆమె చితిపై ఉన్నప్పుడు, చివరికి ఆమె జ్ఞాపకాలతో జీవితం అంతమవుతున్నపుడు భర్తగా ఒక తండ్రి పడే బాధను వకాల్తా పుచ్చుకుని వ్యక్తపరిచిన విధానం ఇందులో కనిపిస్తుంది. ఈ బాధంతా ఆ నాయిన బాధ మాత్రమే కాదు. ప్రతీ నాయిన బాధ. ప్రతీ కొడుకు బాధ. అదీ ఈ కావ్యం గొప్పదనం. అయితే ఈ బాధకు కారణమని ఆ నాయిన ఎవరినీ నిందించలేదు. ఆయనలో ఆయనే మౌనంగా రోధించడం నిశ్శబ్ద గోస కాదు. ఎవరినీ నిందించని గోస, ఈ "సడిలేని గోస".
"అరే సతీషూ!...." అని ఆ తండ్రి పడిన సడిలేని గోసను కవి మౌనంగా మనకు వినిపించాడు. చూపించాడు. తల్లి అవస్థపట్ల, తల్లి దూరం కావడం పట్ల తండ్రి పడే గోసకు ఆచూకీని కనిపెట్టిన గొప్ప కవి బైరెడ్డి కృష్ణారెడ్డి.

"కండ్లెదుట నిశ్చలంగ పడి ఉన్న
అమ్మ మృత కళేభరాన్ని దరిజేర కాళ్ళాడక
అక్కడక్కడనే చుట్టూరా
కాలు కాలిన పిల్లివోలె తచ్చాడుతున్న
ఆ కడపటి చూపుల్ని దాపునకు రానీయకుండా
అమ్మ పక్కన కూసోని ఆపాదమస్తకం
అణువణువూ తడుముతున్న నాయిన..." ఒక దృశ్యాన్ని పాఠకుల కళ్ళముందు నిలబెట్టిన కవిహృదయ ఆర్తి వాక్యాలకు కరిగిపోని మనిషి ఉండడు.

పట్టపగ్గాల్లేని ముక్కుసూటి దూకుడు కాలానికి ముకుతాడు వేసి, గత స్మృతుల భారాన్ని అక్షరాల్లో వలికించాడు. ఈ కవిత్వంతో తన మిత్రుడు నాయిన దుఖాన్ని సమిష్టి పాఠక దుఃఖంగా మార్చి వేశాడు. ఒకచోట "ఓదార్పు దుఃఖానికి హేతువు" అంటాడు. నిజమే ఆత్మీయులను పోగొట్టుకున్న ప్రతీ గుండె చెలిమ కడలిలో ఓదార్పు పెద్ద తరంగంలాంటిది. "పిండాలకు ఎగబడిన కాకుల వలె జీవితాలను అలుముకున్న చీకట్లను కూడా నిందించని" నైరాశ్యాన్ని ఈ కవితలో చూడవచ్చు. కవి ఓచోట "నాయిన, అమ్మ ఒకరికొకరు ఎండా, వాన, రేయి, పగలులా జీవిత పర్యంతం ఒకటిగా ఉన్నారు. మంచాన పడిన తల్లిని వదిలేయని తండ్రి యొక్క గొప్పదనాన్ని, అతని అంతర్మథనాన్ని రెంటినీ ఓ కవిలా కాకుండా కన్నకొడుకులా పట్టి, ఎంతో సహజంగా, చాలా ఉదాత్తంగా రాశాడు. ఈ దీర్ఘ కవిత చదివితే, రాయడం అంటే రాయకుండా ఉండలేకపోవడం అనిపిస్తుంది.
తల్లి తారకమ్మ మాతృత్వపు గొప్పదనపు విశ్వరూపాన్ని, తండ్రికి తన తల్లి పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమానురాగాలను ఈ దీర్ఘ కవితలో పొందుపరిచాడు. ఆమె మరణ సమయంలో ఎంతో విలపించిన కుటుంబ సభ్యులు, బంధువులు నాయినకిక విముక్తి అనుకున్నరు. కానీ అది వట్టి అమాయకత్వమే అంటాడు కవి. నిజమే అనుబంధాలకు కొలమానిక ఎక్కడిది. ఎవరి జ్ఞాపకాల ఉద్వేగాలకు వారు బాధితులు, బానిస మాత్రమే కాదు. బలమైన ఆచూకీ. ఆ ఉనికిని కోల్పోతే తట్టుకొని నిలబడడం ఎంత కష్టమో కవి అక్షరాలలో దర్శించాల్సిందే. కవి తల్లిదండ్రుల లౌకిక, అలౌకిక ఆనందాలు, అలకలు, అలసటలు, అసహనాలు, విసుగూ, వికారాలు ఇవన్నీ వారి మధ్య గుణకారనుబంధాన్ని లెక్కిస్తే... నిజమే, చుట్టూ సమాజానిది ఆ రకంగా ఆలోచించడం వట్టి అమాయకత్వమే అవుతుంది.
తల్లి మరణం తరువాత నాయిన ఏర్పాటు చేసుకున్న శూన్యానుబంధాన్ని, తండ్రి అవస్థను కవి ఒంటరిగా కలిసి అనుభవించాడు. ఆ నిశ్శబ్ద శూన్యంలో తల్లిని తలుచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ తండ్రిని ఒంటరిగానే దర్శించాడు. అక్షరాలను సైతం ఒంటరిగానే పేర్చుకున్నాడు. ఇప్పుడిక ఆ ఒంటరి శూన్యాన్ని ఎందఱో ఈ కవితలో తమ తండ్రిని దర్శిస్తారు.

"బతుకు రంగస్థలంమీద వెతల పోరుకు శిరస్సులొగ్గి
అమ్మకు చేయాల్సినంత చేయలేకపోతిమని..." అని నాయిన పడే బాధను సామూహిక దర్శనానికి నిలిపాడు.

"నాయినా సతీషూ! అమ్మ మృత్యుఘంటికల్లో
ఎవరెవరివో చావు సంకేత రణగొణలో కాదు
నాకు నా మృత్యు ఘంటికలూ వినబడుతున్నై
నా గుండె చప్పుళ్ళు ఆగిపోయిన నాడు
రెండు కన్నీటి బొట్లను నీ గుండె లోతుల్లో
పదిలంగా దాచిపెట్టుకుంటావు కదూ..."


అని కుమారుడు బైరెడ్డి సతీష్ (కృష్ణా) రెడ్డి దగ్గరి నుండి తండ్రి అక్షర హామీని తీసుకున్నాడు. ఒక తండ్రి దుఃఖానికి, తన తండ్రిని గుర్తు చేసుకొని అక్షర నీరాజనం పట్టిన బైరెడ్డి కృష్ణారెడ్డి అక్షరశిల్పిగా చిరకాల మౌన అవస్థను, చీల్చి అచిరకాల కవిత్వ జ్ఞాపిక "సడిలేని గోస"ను పాఠక లోకానికి అందించాడు. "ఎవరెవరి బాధలో రాస్తాను. నా బాధలు దాస్తాను" అని ఓ ప్రసిద్ధ కవి అన్నట్టు బైరెడ్డి కృష్ణారెడ్డి తన ఆత్మీయ విద్యార్థి మిత్రుడు బైరెడ్డి సతీష్ రెడ్డి మాతృమూర్తి కేన్సర్ తో చనిపోయిన తరువాత జరిగిన అంత్యక్రియలలో పాల్గొన్నాడు. సతీష్ నాయిన దుఃఖానికి చలించి, ఈ దీర్ఘకవితను రాశాడు. బైరెడ్డి సతీష్ రెడ్డి ఆంగ్ల భాషను బోధించే డిగ్రీ కళాశాల లెక్చరర్. బైరెడ్డి అనే ఇంటి పేరు తప్ప ఈ బైరెడ్డి ద్వయానికి ఎటువంటి చుట్టరికం లేదు. వీరి గురు శిష్య బంధం ఈ దీర్ఘ కవితకు మూలం. దీని ద్వారా నాయిన దుఃఖానికి ఒక్కటై (వన్ "బై" టూ) సాహిత్య చిరునామాగా నిలిచారు. ఈ సందర్భంగా వారిరువురికి హృదయపూర్వక శుభాకాంక్షలు.- స్మృతి కవిత్వంలో నిలిచిపోయే కావ్యం ఇది.


- శీలం భద్రయ్య
98858 38288

# తాడోపేడో తేల్చుకుంటాం

- పార్టీ ఫిరాయింపులపై జాతీయస్థాయి స్థాయిలో పోరుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై చాలా సీరియస్‌గా ఉంది భారత రాష్ట్ర సమితి. ఎలాగైనా ఉప ఎన్నికలు తీసుకొచ్చి రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ జెండాను రెపరెపలాడించాలని తపన పడుతుంది. పనిలో పనిగా పార్టీ నుంచి క్యాడర్‌ను ,లీడర్ షిప్‌ను కాపాడుకునేందుకు ఇదొక ఎత్తుగడగా వాడుకుంటుంది.
ఇప్పటికే గులాబీ పార్టీ నుంచి పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కొంతమంది బహిరంగంగా పార్టీ మారినట్లు ప్రకటించారు, మరి కొంతమంది మేము ఇంకా బీఆర్ఎస్‌లో ఉన్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారు. ఈ పార్టీ ఫిరాయింపులపై ఏడాది క్రితమే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది భారత రాష్ట్ర సమితి. హైకోర్టు ఎంతకీ తేల్చకపోవడంతో సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వేసిన పిటీషన్‌లో సుప్రీంకోర్టు స్పీకర్‌ను త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినప్పటికీ స్పీకర్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో అదే పిటీషన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ ఇంప్లీడ్ అయ్యారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ 90 రోజుల్లోగా పార్టీ ఫిరాయింపులపై ఏదో ఒక చర్య తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 10న సుప్రీంకోర్టులో విచారణ ఉండబోతుంది. ఆలోపే స్పీకర్ కార్యాలయం నిన్న హడావుడిగా పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఇక పదవ తేదీన సుప్రీంకోర్టు టైం లైన్ కనుక విధిస్తే పార్టీ ఫిరాయింపులపై తొందర్లోనే చర్యలు ఉంటాయని అర్థం చేసుకోవచ్చు.
ఇందుకోసమే గురువారం ఢిల్లీకి వెళ్తున్నారు కేటీఆర్. పార్టీ ఫిరాయింపుల కేసును చాలా సీరియస్‌గా తీసుకున్న కేసిఆర్, కేటీఆర్‌తో పాటు మరికొంతమంది లీగల్ ఎక్స్పర్ట్స్ కూడా ఢిల్లీకి పంపిస్తున్నారు. ఢిల్లీలో న్యాయవాదులతో చర్చించి.. అవసరమైతే రెండు మూడు రోజులు అక్కడే ఉండి కేసును ఫాలోఅప్ చేసుకొనున్నారు. కచ్చితంగా ఈ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ పార్టీ పదే పదే చెబుతూ వస్తుంది. ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ మారిన ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో సమావేశాలు పట్టిమరి కేటీఆర్ చెప్పుకొస్తున్నారు. ఎప్పుడైతే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సీరియస్ యాక్షన్ ఉండాలని పార్టీ గట్టిగా పోరాడుతుందో అప్పటినుంచి నిజానికి పార్టీ ఫిరాయింపులు కూడా తగ్గిపోయాయి. ఎమ్మెల్యేల స్థాయిలోనే కాదు కింది స్థాయిలలో కూడా పార్టీ క్యాడర్ పటిష్టంగానే ఉంది ఇప్పటికీ.. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఇలాగే సీరియస్‌గా పోరాడాలని కేసీఆర్ నిర్ణయం. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే వచ్చే జనరల్ ఎలక్షన్స్ కి ఇది ప్రీ ఫైనల్‌గా ఉంటుందని గులాబీ సైన్యం ఆలోచిస్తుంది. ఉప ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కచ్చితంగా సాధిస్తామని నమ్మకం పార్టీకి గట్టిగా ఉంది.



# రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళి పాటించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలని భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించే అంశం పై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాటారం, భూపాలపల్లి సబ్ డివిజన్లు పరిధిలో పట్ట భద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి సభ్యుల ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికకు 215 మంది పురుషులు, 114 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వీరి కోసం భూపాలపల్లి, మొగుల్లపల్లి, చిట్యాల, గణపురం, రేగొండ, టేకుమట్ల, కొత్తపల్లి గోరిలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కాటారం డివిజన్ పరిధిలోకి వచ్చే ఉపాధ్యాయ శాసనమండలిలో 64 మంది పురుషులు, 19 మంది మహిళలు ఓటు హక్కు వినియోగానికి మహదేవ పూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమెలలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్ట భద్రుల శాసన మండలి ఎన్నికల్లో 1734 మంది. పురుషులు, 749 మంది మహిళలు ఓటు హక్కు వినియోగానికి మహాదేవపూర్, మహా ముత్తారం, మల్హార్ రావు, కాటారం, పలిమేలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానాలతో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న జారీ అయిందని ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉప సంహరణకు ఫిబ్రవరి 13 వరకు గడువు విధించారని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మార్చి 3వ తేదీనఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బంధీగా అమలు చేయడానికి టీములు ఏర్పాటు చేశామని, ప్రచారానికి సంబంధించి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తనా నియమాలు అమల్లో జిల్లా యంత్రాంగపు ఆదేశాలు పాటించాలని సూచించారు. ఈనెల 10వ తేదీన గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా అందజేస్తామని ఆయన తెలిపారు. ఆర్డీఓ, మంథని నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మండలాలకు కాటారం సబ్ కలెక్టర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తాం "ని ఆయన పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివా సులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, ఇమామ్ బాబా, నవీన్, గుర్తింపు పొందిన వివిధ రాజ కీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండ పల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కట్టు మల్ల మధు, తుమ్మ నరసింహ అశ్వ బాలరాజ్, మొగిళ్ళ నరసింహ, కటికల మధు, జూలపల్లి యాదయ్య, తుమ్మ నరసింహ, రాగాయపల్లి శీను, బ్యాగరీ యాదయ్య, బ్యాగరి శీను సంఘీ చెన్నయ్య, వడ్డేమోని నరసింహ, డ్రైవర్ శీను తదితరులు పాల్గొన్నారు.

# సొంత గూటికి చంద్రయన్ పల్లి తండా యువ నాయకులు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటి చంద్రయన్ పల్లి తాండ 1వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి సమక్షంలో సురేందర్ నాయక్, ఎన్ గోపి,అశోక్, కేతావత్ వినోద్, కె మల్లేష్, ప్రభాస్, సభావత్ శివరాం,వి శంకర్, దాదాపు 40 మంది యువ నాయకులను, ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులను బీజేపీ కుటుంబంలోకి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క పరివర్తనాత్మక నాయకత్వంపై వారి విశ్వాసం మరియు వికసిత్ భారత్ పట్ల ఆయనకున్న దృక్పథం వారిని బీజేపీలో చేరే దిశగా ప్రేరేపించయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కల్వకుర్తి బీజేపీ పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్స్ కృష్ణ యాదవ్, చెక్కల లక్ష్మణ్, నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, కల్వకుర్తి నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు విష్ణు చారి, తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో జాతీయ నులి పురుగుల దినోత్సవం

## విద్యా సంస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**విశ్వంభర, మహబూబాబాద్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం, (నట్టల నివారణ) 10-02-2025 ను పురస్కరించుకొని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆల్బెండజోల్ టాబ్లెట్ వేయడం జరుగుతుందని, ఒకటి నుంచి రెండు సంవత్సరాల వరకు సగం టాబ్లెట్ ని రెండు చెంచాల మధ్య సగం మాత్ర పొడి చేసి కొద్దిగా నీరు కలిపి ఇవ్వాలని, రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు పూర్తిగా ఆల్బెండజోలు మాత్ర పొడి చేసి కొద్దిగా నీరు కలిపి ఇవ్వాలని, మూడు నుంచి 19 సంవత్సరాలలో పిల్లలకి ఆల్బెండజోల్ టాబ్లెట్ మొత్తం నమలి మింగే లాగా చూడాలని అన్ని లైన్ డిపార్ట్మెంట్స్ అన్నీ కూడా సహాయ సహకారాలతో ఈ ప్రోగ్రాం విజయవంతం చేయాలని అన్నారు. నులిపురుగులు మానవులలో ప్రేగులో నుండి పోషకాహారం గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు అని నులిపురుగుల సంక్రమణ ఉన్న పిల్లవాడు నులిపురుగుల గ్రుడ్లు కలిగిన మలముతో నేలను కలుషితం చేస్తాడని ఈ గ్రుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయని మిగతా పిల్లలు ఈ గుడిలో ఆహార ద్వారా లేదా మురికి చేతుల ద్వారా, లార్వా చర్మం లోపలికి చొచ్చుకపోవటం ద్వారా నులిపురుగులు సంక్రమణ అవుతాయని, నులిపురుగులు సంక్రమించిన పిల్లల్లో గ్రుడ్లు లార్వాలు నులిపురుగులు అభివృద్ధి చెందుతాయని ఈ నులిపురుగులు తిరిగి ఉత్పత్తి చేసి పిల్లలకు అనారోగ్యాన్ని కలిగిస్తాయని పేర్కొనడం జరిగింది. నులిపురుగుల ప్రభావం వల్ల పిల్లలు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరేచనాలు బరువు తగ్గడం గ్రహించవచ్చని కావున ఆల్బెండజోల్ మాత్ర నులిపురుగుల సంక్రమణ నియంత్రంచటంలో సహాయపడుతోందని, రక్తహీనతను నియంత్రిస్తుందని పోషకాల గ్రహీతను మెరుగుపరుస్తుందని, ఏకాగ్రత నేర్చుకోగల సామర్థ్యం, కళాశాలలో, పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాలలో హాజరును మెరుగుపరుస్తుందని, పర్యావరణలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించి సమాజానికి మేలు చేస్తుందని పేర్కొనడం జరిగింది. అదేవిధంగా పదవ తేదీ నాడు వేసుకొని పిల్లలు 17న మా పాప్ రౌండ్ రోజున కూడా వేసుకోవచ్చు అని పేర్కొన్నారు. జడ్పీ సీఈఓ పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురలీధర్, డీఈఓ రవీందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ ప్రమీల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ, ప్రభుత్వ హాస్పిటల్ ఆర్ఎంవో జగదీశ్వర్, సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణనాగేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, బీఎండ బ్ల్యాట శ్రీనివాస రావు, డీఎస్ఓ ప్రేమ్‌కుమార్, శ్రీరాములు, డీపీఓ హరిప్రసాద్, డీడబ్ల్యు ఓ ధనమ్మ కె. విరాజు హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ఈవో రామ కృష్ణ, డీవీఎల్ఎం రవి, జిల్లా సైన్స్ అధికారిఅప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

# బీసీ సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు



**విశ్వంభర, పరిగి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించుటకు నిర్ణయం తీసుకున్న సందర్భంగా బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో బీసీ సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా బీసీల అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పరిగి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆనంద్, మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కాంగ్రెస్ నాయకులు బాబయ్య, శ్రీనివాస్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# క్రిమిలేయర్ అమలు చేయండి

## క్రాంతికర్ శ్రీ పోకల కిరణ్ మాదిగ



**విశ్వంభర, హైదరాబాద్:** బర్కత్పురాలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు మరియు ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీము అక్తర్ సూచించినటువంటి (సంపన్న దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, గ్రూప్ వన్ ఆఫీసర్స్, మేయర్లు, జెడ్పీ చైర్మన్ లను) ఎస్సీ రిజర్వేషన్ల నుండి మినహాయించి క్రిమి లేయర్‌ను రేవంత్ రెడ్డి అమలు చేసి సంపన్న దళితుల నుండి పేద దళితులకు ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను గ్రూపులుగా అందే విధంగా కృషి చేయాలని మంత్రివర్గ కమిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో భారీ ఉద్యమం చేపడతామని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ అన్నాడు. మాలమాదిగ ఉపకులాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి దయానంద రావు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఉపాధ్యక్షులు పోరాటాల రామన్న, ధర్మాల సాయికుమార్, శ్రీధర్ మాల, హైదరాబాద్ గ్రేటర్ అధ్యక్షులు కొండూరు రాజు మాదిగ, హైద రాబాద్ అధ్యక్షులు బాలస్వామిమాదిగ, సికింద్రాబాద్ అధ్యక్షులు బాలరాజ్‌మాదిగ, పాల్గొన్నారు.

# ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ బ్యాంకింగ్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ

**విశ్వంభర, మహబూబాబాద్:** ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. ఎంపీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ఆన్ లైన్ ద్వారా ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 లు, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000 లు మించ కూడదని ఆయన పేర్కొన్నారు. ఎంపిక విధానం ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా అలాగే రిజర్వేషన్ నియమం ప్రకారం ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత గల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుండి 14 వరకు ఉంటుందని, ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# మందకృష్ణ తాకట్ల మారోడు: డాక్టర్ పిడమర్తి రవి

## 11 శాతం రిజర్వేషన్ అడగడం బీజేపీ కోసమే



**విశ్వంభర, హైదరాబాద్:** మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఉద్యమంలో ఏ రోజు 11 శాతం రిజర్వేషన్ కావాలి అని డిమాండ్ చేయకుండా వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో అమలైన తర్వాత తన నిజస్వరూపమైన రంగులు మార్చే వైఖరితో 11శాతం రిజర్వేషన్ అనడం మాదిగలను మోసం చేసే కుట్రలో భాగమేనని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడ మర్తి రవి అన్నారు. మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల ఉద్యమంలో 7 శాతం రిజర్వేషన్ కావాలని డిమాండు పెట్టి ఇప్పుడు 11 శాతం కావాలనడం అర్థరాహిత్యమని అన్నారు. నేను 15 సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని వివిధ కార్యక్రమాల ద్వారా అనేక సభల్లో డిమాండ్ చేశానని ఆ డిమాండ్‌ను ఏఒక్కరోజు కృష్ణ మాదిగ సమర్థించకుండా ఉండడమే కాకుండా ఏ ఒక్క రోజు మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అనే డిమాండు పెట్టలేదు. అది కేవలం ఈ రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కోసమే అడిగాడని 11 శాతం అడిగి ఈ రాష్ట్రంలో మాదిగలకు తీరని అన్యాయం చేసి బీజేపీ పార్టీని బలోపేతం చేసి రాజకీయ లబ్ధి పొందడానికే అని తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర పార్లమెంటు ఎన్నికల్లో ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి వచ్చిన ప్పుడు మాదిగలకు ఎంత శాతం అనేది చెప్పకుండా ఏబీసీడీ వర్గీకరణ చేయాలి అని మాత్ర మే చెప్పారని మూడు దశాబ్దాల క్రితం పెట్టిన ఏడు శాతం డిమాండ్ ని చెప్పారని అన్నారు. మందకృష్ణ మాదిగకు కాంగ్రెస్ పార్టీ వర్గీకరణ చేయడం ఇష్టం లేదని నేను పదేపదే చెప్పానని, అనుకున్న విధంగానే కృష్ణ మాదిగ వైఖరి బట్టబయలు అయిందని అన్నారు. మాదిగలు వర్గీకరణ ఫలాలు పొందే సమయంలో వాటిని మాదిగలకు దక్కకుండా చేసి రాజకీయ లబ్ధి పొందాలని కృష్ణ మాదిగ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ ఆధారంగా సైదాంతిక పరంగా హాలో 9 శాతం రిజర్వేషన్ కల్పించడం న్యాయమైనదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని షెడ్యూల్ కులాల లోని అన్ని ఉపకులాలకు సమన్యాయం చేసిందని పిడమర్తి రవి అభిప్రాయపడ్డారు.

# కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే విధంగా ఉంది: ఎస్.కే.యం




**విశ్వంభర, మహబూబాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతు కార్మిక ప్రజా వ్యతిరేకమైనది కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే విధంగా బడ్జెట్ గా ఉందని, బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం జాతీయ స్థాయిలో పిలుపూ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం జిల్లా కన్వీనర్ కామ్రేడ్ గుజ్జు దేవేందర్ అధ్యక్షతనా జరగగా, వక్తలుగా ఏఐపీకేయు రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ పాయం చిన్న చంద్రన్న, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సనప పోమ్మయ్య ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్ సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగయ్య టి.యు.సి.ఐ జిల్లా కార్యదర్శి బిల్లా కంతి సూర్యం, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు ఎస్కే మదర్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ బిల్లుల లో కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక బిల్లు గా తీసుకు వచ్చిందని వారు మండిపడ్డారు. రక్షణ రంగానికి 6,81210 కోట్లు అధిక నిధులు కేటాయించిందని, వ్యవసాయ రంగాన్ని 1,71 437 కోట్లు చిన్నచూపు చూస్తూ అతి తక్కువ కోట్లు మాత్రమే కేటాయించిందని, అదేవిధంగా ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలే సిందని విద్యారంగానికి 1,28,650 కోట్లు కేటాయించి పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు పాపయ్య, లింగన్న, బాబన్న, తాజ్ పాషా, వీరన్న, రాజన్న, యాకయ్య, రాజమౌళి సత్యం, భాస్కర్ రెడ్డి, వెంకన్న, జబ్బర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే వాక్ ఔట్

## ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం "సై" అన్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా? లేదా? తెలపకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసు తో వాక్ అవుట్ చేయడం దురదృష్టకరమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, హుజురాబాద్ మాజీ యువజన కాంగ్రెస్, ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ వంశీ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకనే శాసనసభను భారత రాష్ట్ర సమితి బహిష్కరించిందని ఆరోపించారు. వర్గీకరణతో పాటు కీలకమైన బీ.సీ. కులగణన పై చర్చ జరుగుతుంటే, శాసనసభకు రండి అని మా ముఖ్యమంత్రి చెప్పిన కేసీఆర్ రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. లక్ష పుస్తకాలు చదివిన మేధావి తన సూచనలు ఇస్తారని ఆశించిన ఫలితం లేక పోయింద న్నారు. తెలంగాణ వస్తే రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానని, బీసీలకు బీసీ బందు అమలు చేస్తానని రకరకాలుగా మోసం చేశారని, తమ నాయకులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కులగణన చేయడమే కాక ఎస్సీ వర్గీకరణకు కూడా కాంగ్రెస్ పార్టీ స్వాగతం చెప్పిందని అందుకు పూర్తి మంత్రి వర్గానికి యావత్ రాష్ట్రం అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.

# బీజేపీ నాయకుల పరామర్శ

**విశ్వంభర, భూపాలపల్లి:** జనగాం జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కె.వి.ఎల్.ఎన్ రెడ్డి తండ్రి కల్వల భూపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు.వారి కుటుంబాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట నాయకులు లింగంపల్లి ప్రసాదరావు, దాసరి తిరుపతిరెడ్డి, సుదాటి వేణు రావు, పెండ్యాల రాజు తదితరులున్నారు.

# నర్సాపూర్‌లో ముదిరాజ్ సంకల్ప భేరి సభ

బీసీ కులగణనతో సామాజిక న్యాయం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాహుల్ గాంధీ

బీసీల, ముదిరాజుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారు

ముదిరాజులని బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చడానికి కృషి: నీలం మధు ముదిరాజ్



**విశ్వంభర, మెదక్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా న్యాయం జరుగుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో సాయి కృష్ణ గార్డెన్ లో ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంకల్ప భేరి సభకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ కులగణన తో బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా లబ్ధి చేకూరుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు ముఖ్యంగా ముది రాజులకు పెద్ద ఎత్తున అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ముదిరాజ్ సోదరులు వినియోగించుకుని రాజకీయంగా ఎదగాలని సూచించారు. బీసీ కులగణన చేయడంతో బీసీల జనాభాలో ముదిరాజ్‌ల శాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని తేలిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్‌ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. చాలా రోజులుగా ముదిరాజ్ సోదరులు కోరుతున్న బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే డిమాండ్ ను సీఎం దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని మన దీర్ఘ కాలిక డిమాండ్ పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా బీసీ కులగణనను నిర్వహించినందుకు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బీసీ కుల గణన నిర్వహించి బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశ,రాష్ట్ర నాయకత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రివర్గానికి తెలంగాణ బీసీ సమాజామంతా రుణపడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముదిరాజ్ సంక్షేమ సమితి సభ్యులు బానిస నారాయణ, బాలు నర్సింలు, సురేష్,రమేష్, సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు గారెల శ్రీనివాస్, సుంకర బోయిన మహేష్, స్థానిక నాయకులు మాజీ జడ్పీటీసీలు సంతోష్, ఆంజనేయులు, కరే కృష్ణ, సందీప్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల అరెస్టు



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంలో భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల స్థానిక సర్పంచులను పోలీస్ స్టేషన్లో బైండోవర్ చేస్తూ తాజా మాజీ సర్పంచుల హక్కులను కాల రాస్తున్నారని ఉద్దమారి మహేష్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తాజా మాజీ సర్పంచుల పై ప్రజా వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. అక్రమ అరెస్టులు, బైండోవర్ లతో మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్ల పోరాటాన్ని అణచి వేయలేరని అని అన్నారు. గతంలో పలుమార్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ సమస్యను విన్నవించిన సందర్భంలో వారు మాట్లాడుతూ పాత సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు పోతామని బూటకపు హామీ ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న చర్యలు, హామీలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్రంలోని మొత్తం సర్పంచులను మోసం చేశారని దుయ్యబట్టారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మేల్కొని తాజా మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు కోలీపాక రాజయ్య, బిలకంటి ఉమేందర్రావు,చదువు మధుర మహేందర్ రెడ్డి,నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

# ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి



**విశ్వంభర, పరిగి:** సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సీఎం, మంత్రుల నివాసాల ముట్టడికి పిలుపుతో బుధవారం పరిగి పోలీసులు మాజీ సర్పంచులు రాజేందర్, జగన్, వెంకటయ్య, బాలప్పలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి కుమార్ రెడ్డి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ..ప్రతిపక్ష హోదాలో సర్పంచుల పెండింగ్ బిల్లులపై ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా ఇరవై కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. చాలా మంది సర్పంచులు అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్పంచు లకు రావాల్సిన బిల్లులు చెల్లించా కే స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలి అని ప్రభుత్వాన్ని కోరారు.

# 50 ఆకుల తునికాకు కట్టకు 6 రూపాయలు చెల్లించాలి

కాంట్రాక్టర్లకు సముచితమైన రేట్లకు టెండర్లు కేటాయించాలి

సకాలంలో పూనింగ్ పనులు చేపట్టాలి

సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 సీజన్లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి వెంటనే పూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఆకులతో కూడిన కట్టకు రూ.6లు ప్రభుత్వ ధరగా నిర్ణయించాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేండ్లుగా పెండింగులో వున్న బోనస్ను ఆకుసేకరణకు ముందే ఆదివాసులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపులలో అవకతవకలు, అవినీతి, అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయి. వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు, కూలీలకు ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకుఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయలకు అవకాశం వున్న తునికాకు సేకరణకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తునికాకు సేకరణ సందర్భంలో సంభవించే అన్ని రకాల ప్రమాదాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ కోరింది. తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఆదివాసీలు, గిరిజనులు పేద ప్రజలు తునికాకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం తర్వాత రెండవ ఆదాయం తునికాకు సేకరణే. తెలంగాణ రాష్ట్రంలో 196 యూనిట్లు వున్నాయి. ఆకు కొరతగా ఏర్పడుతున్న నేటి పరిస్థితుల్లో తునికాకు కోతకు సంబంధించిన అన్ని పనులకు కూలీరేట్లు, ఉల్టా, పల్టా రేట్లు, కల్లెడార్లు, గిర్దావర్ల జీతాలు, లోడింగ్ అన్ లోడింగ్ వంటి అన్ని రకాల పనులకు, స్త్రీ-పురుషలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. శ్రమకు తగ్గట్లుగా ప్రభుత్వమే రేట్లుపెంచాలి, ప్రభుత్వాన్ని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందని మీడియాకు అశోక్ తెలిపారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

## ఎస్ఐ సంతోష్ కుమార్



**విశ్వంభర, పరిగి:** పరిగి మండల పరిధిలో ని రాపోల్ గ్రామంలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాల పై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాటాడుతూ.. ప్రస్తుతం రోజురోజుకు సీసీ కెమెరాల ప్రాధాన్యత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో నేరాలు నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు.దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగవర్ధన్, జంగయ్య,నరసింహారెడ్డి, వెంకటేష్, రాకేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లింగమంతుల స్వామి జాతరకు ఏర్పాట్లు చేయాలి



**విశ్వంభర, సూర్యాపేట:** శ్రీ లింగమంతుల స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ తెలిపారు. బుధవారం సూర్యాపేటలోని దురాజ్ పల్లి పెద్దగట్టు వద్ద సంబంధిత శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది పెద్దగట్టు వద్ద బందోబస్తు ఏర్పాటు పకడ్బందీగా ఉండాలని, అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రదేశాలు వద్ద, ట్రాఫిక్ నియంత్రణ, చేయుటకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని, భక్తుల కొరకు ప్రవేశ ద్వారాలు నిష్క్రమణ ద్వారా వద్ద ప్రత్యేక నిగా ఏర్పాటు చేయాలని, వీఐపీ ల కోసం ప్రోటోకాల్ అధికారిని నియమించాలని, సూపర్ డెంటల్ ఆఫ్ పోలీస్ రవికుమార్ కు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అధికారులు అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని దేవస్థానం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను స్వీకరించి పార్కింగ్, తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు కొరకు భూమి చదును చేయడం, యాదవ పెద్దలకు సాంప్రదాయ వస్తువులు మరియు బట్టలు ఏర్పాటు చేయవలసిందిగా ఆర్డీవో వేణుమాధవ్‌కు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శానిటేషన్, రోడ్లకు ఇరువైపున ఉన్న బుషెస్ తొలగింపు అలాగే తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, గుట్టపైన మహిళల కొరకు డ్రెస్సింగ్ రూమ్ లో ఏర్పాటు, అలాగే మూడు షిఫ్టులలో 24 గంటలు పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చేయడం అన్ని పార్కింగ్ ప్లేస్‌ల వద్ద టవర్ లైట్లు, గుడి చుట్టూ ఉన్న రోడ్లకు లైట్లు ఏర్పాటు, చేయాలని అలాగే స్టాల్స్ కొరకు ఆయా శాఖల వారికి టెంట్లు, బల్లలు, కుర్చీలు ఏర్పాటు 5 జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమగు ప్రాంతాలలో టాయిలెట్స్ నిర్మాణం చేయాలని, గట్టుకు చుట్టుపక్కల ఏర్పాటును కమిషనర్ పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పరచాలని, పార్కింగ్ ప్లేస్‌ల వద్ద భక్తులు ఎక్కువగా ఉండే ప్రాంతాల వద్ద త్రాగునీటి కొరకు పంపులు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం మరియు ఇతర పనులు పరిరక్షించడానికి పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బందిని నియమించాలని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ అధికారులు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నిచోట్ల లైట్ల ఏర్పాట్లు ఉండాలని అలాగే జాతరకోవచ్చు భక్తుల అహల్లాదం కొరకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసిన పిదప అన్ని వినోద వస్తువులతో ట్రైలర్ రన్ నిర్వహించాలని, అనుమతులు నిబంధనలకు కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రధమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు, అలాగే వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా విధులు ఏర్పాటు చేయాలని దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలలో సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ ఓ కోటాచలం కు ఆదేశించారు. ఈ సారి జాతరకు 16వ తేదీన సాయంత్రం నుండి 18వ తేదీ వరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఈవో కుశలయ్య తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది కంట్రోల్ రూమ్ వద్ద ఒక పెద్ద అగ్నిమాపాక యంత్రం, పార్కింగ్ ప్లేస్ వద్ద అగ్ని మాపక యంత్రం, రెండు మొబైల్ వెహికల్స్ కూడా సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ జిల్లా అభిమాపక అధికారికి ఆదేశించారు. ఆర్టీసీ సిబ్బంది తాత్కాలిక బస్టాండ్‌ల ఏర్పాటు, అలాగే బస్సులు సులువుగా వెళ్లడానికి రావడానికి రోడ్డు మార్గాలు, రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ప్రదేశాల నుండి వచ్చే బస్సులకు ఏర్పాట్లు చేయాలని, అలాగే బస్సుల ద్వారా ప్రముఖ ప్రదేశాలకు జాతర గురించి తెలిసే విధంగా గోడ పత్రికలు అందించాలని కలెక్టర్ తెలిపారు. అన్ని కార్యక్రమాలను విడియో కవరేజీ, పోస్టర్ల ముద్రణ, అన్ని ప్రాంతాలకు గోడపత్రికలు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాఅదనపు కలెక్టర్ పి రాంబాబు, లింగమంతులస్వామి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పోలబో యిన నరసయ్య యాదవ్, ఆర్డిఓ వేణు మాధవ రావు, సీపీఓ ఎల్ కిషన్, డి.ఎస్.పి రవికుమార్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీపీఓ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎండోమెంట్ ఈవో కుశలయ్య, కలెక్టరేటే ఏవో సుదర్శన్ రెడ్డి, సూపర్నెంట్ పద్మారావు, తాహసీల్దారులు శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఈఈ మాధవి, ఏఈ రాహూల్, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ వైస్ శ్రీనివాసరావు, గ్రిడ్ అరుణాకర్ రెడ్డి, డీటీ ఓ సురేష్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ నారాయణ, డీఎంఆర్ టీసీ డిసుందర్. సిబ్బంది పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 2025 డైరీ ఆవిష్కరణ



**విశ్వంభర, కరీంనగర్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ ముద్రించిన 2025 డైరీని స్థానిక యూనియన్ కార్యాలయం ప్రెస్ భవన్‌లో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్ కొయ్యడ చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల దినచర్యలో భాగంగా ఉపయోగపడే విధంగా సమగ్ర సమాచారంతో అందరికీ ఉపయోగపడే విధంగా ఉంటుందని ప్రపంచంలో జరిగే ప్రతి విషయాన్ని అందులో పొందుపరచుకునే విధంగా ఉంటుందని ఈరోజు డైరీని ఆవిష్కరించుకోవడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, కోశాధికారి గాజుల వెంకటేష్ రాష్ట్రహెల్త్ కమిటీ సభ్యులు విజయసింహారావు, నర్సింగోజు మహేందర్, రాష్ట్ర సోషల్ అండ్ డిజిటల్ మీడియా క్యాంపెనింగ్ కమిటీ సభ్యులు ఒంటెల కృష్ణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు సయ్యద్ ఇమాముద్దీన్, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఊరడి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, ఏ శైలేందర్, ఎండి సుకూర్, సంయుక్త కార్యదర్శులు దాడి సంపత్, పోలు సంపత్, నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్ ఎంఏ అసాద్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# రాచకొండ దర్గా ఉర్సు ఉత్సవాల పోస్టర్ విడుదల

## పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** హిందూ ముస్లిం లు కలిసి మత సమరస్యానికి, ఐకమత్యానికి ప్రతికలుగా సోదరాబావంతో ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకునే రాచకొండ హజ్రత్ గాలిబ్ షాహిద్ దర్గా, బోలె షాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఎంతో చరిత్రగలవని మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 24 నుండి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం అవుతాయాని ఈ సందర్భం గా దర్గా మూతవాలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కి భక్తుల సౌకర్యం కొరకు మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అదేవిదంగా దర్గాకు చదర్‌ను బహుకరించారు. సూదుర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు చేపట్టెందుకు అధికార యంత్రంగానికి ఆదేశాలు జారీ చేసినందున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి దర్గా మూతవాలి మహమ్మద్ ఇమ్రాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రములో దర్గా ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ, దర్గా మూతవాలి మహమ్మద్ ఇమ్రాన్, కాంగ్రెస్ మండలం కమిటీ అధ్యక్షులు కె శ్రీను నాయక్, డీసీసీ కార్యదర్శిలు కె బిక్షపతి నాయక్, ముద్దంగుల నర్సింహా, ఏపూరి సతీష్, మండలం నాయకులు ఉప్పల లింగస్వామి, ఎండీ రహీమ్ షరీఫ్, నహిమా షరీఫ్, సాధక్ కూరేసి, ఇలియాస్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జై భీమ్ యూత్‌కు 10 డప్పుల అందజేత



**విశ్వంభర, కల్వకుర్తి:** మందకృష్ణ మాదిగ తన జాతి హక్కుల కొరకు గత 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ చివరి దశకు చేరుకున్న సందర్భంగా లక్ష డబ్బులు వేల గొంతులు కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంగా కోరుకొండ మండల కేంద్రంలోని జై భీమ్ యూత్ అసోసియేషన్ కు నవభారతి అసోసియేషన్ ఫర్ ఎడ్యుకేషన్ హెల్త్ గేమ్స్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఊరుకొండ మాజీ సర్పంచ్ అధ్యక్షులు నవ భారతి అసోసియేషన్ నాగర్ కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మేకల శ్రీనివాసులు తన వంతు సహాయంగా 10 డప్పులను కార్యకర్తలకు అందజేశారు.

# బీసీ,ఎస్సీ,ఎస్టీల లెక్కలు తగ్గించటం సరైనది కాదు

## ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు విజయరామరాజు



**విశ్వంభర, సూర్యాపేట:** తెలంగాణలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సబ్బండ కులాల సామాజిక ఆర్థిక రాజకీయ విద్య ఉద్యోగ రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన కుల గణన రిపోర్టుని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర కోణంతో సమగ్రంగా రూపొందించకపోవడం వల్ల దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ధర్మ సమాజ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకులు డి. విజయరామరాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైతు బజారు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ కుల గణనలో మా బీసీ ఎస్సీ ఎస్టీల లెక్కలు తగ్గించడం అంటే గంగ్రగొడ్డలితో నరకడంతో సమానం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక కులగనలలో నిజాలను దాచి బీసీ, ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలను మరింత బలహీన పర్చాలని దురుద్దేశంతోనే 65 శాతంగా ఉన్న బీసీల జనాభా ని 56 శాతం 21 శాతంగా ఉన్న ఎస్సీల జనాభా ని 17 శాతం గా, 12 శాతం గా ఉన్న ఎస్టీల జనాభా ని 10 శాతంగా చూపి ఆయా వర్గాల జనాభా శాతాన్ని తగ్గించి ఆదిపత్య వర్గాల జనాభా శాతాన్ని పెంచుకునే కుట్ర చేశారన్నారు. 7 శాతం ఉన్న అగ్రకులాకు 10శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ అమలుపై జరుగుతున్న దేశవ్యాప్త వ్యతిరేక ఆందోళనను అణచివేసేందుకే అగ్రకులాల జనాభా శాతాన్ని అధికంగా చూపించుకొని చారిత్రాత్మక మోసానికి ఒడిగడుతూన్నారని తెలిపారు. భావితరాల భవిష్యత్తుని కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మరో ప్రజా ఉద్యమానికి యావత్ తెలంగాణ సమాజం సిద్ధపడాలని అందుకోసం బీసీ ఎస్సీ ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీ తో కలిసి త్వరలోనే ఐక్య కార్యచరణ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు. కుట్రపూరితంగా అసమగ్రంగా ఉన్న రిపోర్ట్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్యపై అన్ని పార్టీల్లో ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మౌనం వీడి అసెంబ్లీ చర్చల్లో గొంతు విప్పి మాట్లాడి బహిష్కరించాలని కోరారు. ధర్మ సమాజ్ పార్టీ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్ యాదవ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సైదులు, ఎం.భాస్కర్, నాగేంద్రబాబు, పేరాల శ్రీనివాస్, నాగార్జున, రమేష్, నరేష్, భాస్కర్, లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కార్‌లో బీసీవర్గాలకు అవమానాలే



**విశ్వంభర, భూపాలపల్లి:** 78 ఏండ్ల స్వాతంత్ర్యం అనంతరం దేశానికి వెన్నె ముఖ లాంటి బీసీ సామాజికవర్గాలకు రేవంత్ సర్కార్‌లో అవమానాలే దక్కుతున్నాయని, సీఎం రేవంత్ నిర్ణయం బీసీ వర్గాలను అపహస్యం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజ్వేషన్లను కల్పిస్తామని మోసం చేయడంతో పాటు బీసీల సంఖ్యను తగ్గించి అసెంబ్లీలో ఎలాంటి చట్టబద్ధత కల్పించకుండా కులగణన నివేదిక ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లో నల్లబ్యాడ్జీలను నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుదూ దేశంలో ఏ ఉత్పత్తి జరుగాలన్న అది బీసీ వర్గాలతోనే సాధ్యమవుతుందని, ఉత్పత్తి కులాలుగా పేరున్న బీసీ సామాజికవర్గాలే దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి బీసీల పట్ల రేవంత్ సర్కార్ నిర్ణయం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎన్నికల మానీఫెస్టోలో గొప్పగా చెప్పి 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి కులగణన చేసి కేవలం జనబా లెక్కలు చెప్పి చేతులు దులుపుకున్నారని ఆయన అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జనాబా లెక్కలు 2014 కంటే తక్కువ చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలు, ఎస్సీల సంఖ్యను చూపించి ఓసీల సంఖ్య పెంచి చూపించారని, ఈడబ్ల్యూసీలో ఓసీలకు సమాన హక్కులు రావడానికి రిజర్వేషన్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన వివరించారు. ఆనాడు నెహ్రూ కాంగ్రెస్ పార్టీ సమయంలో తరహాలో కులాలను విడగొట్టినం ఈ కులాలు ఒక్కటి కావు విడిపోయి ఉన్నరు వీళ్లలో ఇక చైతన్యం రాదనే అహంకారంతోనే సీఎం నిండు అసెంబ్లీలో రిపోర్ట్‌ను ప్రవేశపెట్టి బీసీ వర్గాలను అవమానించారని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అంటే కాంగ్రెస్ పార్టీకి నచ్చదన్నారు. ఎన్నికల మానీఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా బావించే దేశంలో మంథని కేంద్రంగా మంథని ఎమ్మెల్యే మానీఫెస్టో కమిటి ఛైర్మన్‌గా తయారు చేసిన మానీఫెస్టో దేశానికి మచ్చగా మారిందని, మంథని ఎమ్మెల్యే నాయకత్వంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుండగా తాజాగా కులగణన కూడా ఖూనీ అయిందన్నారు. రాహుల్ గాంధీ ఎన్ని రాజ్యాంగం బుక్కులు పట్టుకుని తిరిగినా కాంగ్రెస పార్టీని ఈ సమాజం నమ్మదని, బీసీ వర్గాలను అవమానిస్తూ అసెంబ్లీలో కులగనణ రిపోర్ట్‌ను ప్రవేశపెట్టిన ఫిబ్రవరి 04ను చీకటి రోజుగా గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు.

# కాళేశ్వరంలో ఎస్పీ పర్యటన



**విశ్వంభర, కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగబోయే కుంభాభిషేకం, మహాశివరాత్రి, సరస్వతీ పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. ఈ నెల 7,8,9 వ తేదిలలో కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో జరిగే కుంభాభిషేకం మరియు మహాశివరాత్రి, మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలలో అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుటకు రావడం జరుగుతుంది. కావున ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కాళేశ్వర ఆలయ పరిసరాలు, మెయిన్ ఘాట్, వీఐపీ ఘాట్, బైపాస్ రోడ్డు లలో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. ఎస్పీ పోలీస్ సిబ్బందికి వాహనాలకు సరైన పార్కింగ్ ఉండే విధంగా, ట్రాఫిక్ జాం కాకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమమే డబ్ల్యూజేఐ లక్ష్యం

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్



**విశ్వంభర, మేడిపల్లి:** క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా పని చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో జరిగిన డబ్ల్యూజెఐ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆవిర్భవించి 17 రాష్ట్రాల్లో విస్తృత సేవలు అందిస్తున్న డబ్ల్యూజేఐ జర్నలిస్టుల ఆదరణ పొందుతూ తెలంగాణలోనూ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న డబ్ల్యూజెఐ త్వరలోనే మీడియా రంగంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని అన్నారు. సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసే జర్నలిస్టులు క్రమశిక్షణతో మెలుగుతూ, తమ గుర్తింపును కాపాడుకోవాలని సూచించారు. డబ్ల్యూజేఐలో ఉన్న ప్రతి సభ్యుడు ఐక్యతతో పనిచేయడం ద్వారానే హక్కుల సాధనకు మార్గం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర నాయకత్వం సైతం సభ్యులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు,వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

**మేడిపల్లి మండల కమిటీ ఎన్నిక...**

ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) మేడిపల్లి మండల అడహాక్ కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్ కుమార్ పర్యవేక్షణలో తొలుత మేడిపల్లి మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.సమావేశంలో సభ్యుల ఏకాభిప్రాయం మేరకు మండల అధ్యక్షుడిగా కూరెళ్ళ ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా వావిలాల చంద్రశేఖర్, కోశాధికారిగా శ్రీనివాస్ లకు బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, సురేష్ చౌదరి, సంయుక్త కార్యదర్శిగా నందీశ్వర్,కార్యనిర్వాహక కార్యదర్శిగా వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా శంకరాచారి,ప్రవీణ్,నరేందర్, కిరణ్ నాయక్, ఎంఎస్ జార్జ్, ప్రకాష్, రత్నకుమార్,దీపక్, కృష్ణ, ఎల్లేష్ లను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గాన్ని అభినందించిన రాష్ట్ర కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు.

# కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాటిచ్చారు..

## మా ప్రజా ప్రభుత్వం చేసి చూపించింది: మల్‌రెడ్డి రాంరెడ్డి

**విశ్వంభర, లింగోజిగూడ:** కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు సీఎం రేవంత్ రెడ్డి గారికి మద్దతుగా, టీపీసీసీ పిలుపు మేరకు జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మరియు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఏపూరి సోమన్న తన కళాకారుల బృందంతో కలిసి పాల్గొని ఆకర్షణీయమైన ప్రదర్శనతో సంబురాలకు మరింత ఉత్సాహం నింపారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిగా బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఎస్సి వర్గీకరణను అమలు చేయడం ద్వారా విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో వారికి గత్యంతరాలు అందించాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ముందడుగు వేశారని తెలిపారు .బీసీ రిజర్వేషన్ల పెంపుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహకరించాలని పేర్కొన్నారు .గత వందేళ్లుగా కులగణన జరగకపోవడం వల్ల బీసీ వర్గాలు తీవ్రంగా నష్టపోయాయయని తెలిపారు .తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలుస్తున్నారని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలు, వివిధ విభాగాల ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కుంభాభిషేక మహోత్సవాలకు ఆహ్వానం

## జిల్లా కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందచేసిన ఈవో



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం దేవ స్థానంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరుగనున్న మహా కుంభాభిషేకం మహోత్స వాలకు ఆహ్వాని స్తూ బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాట్ల వివరాలను ఈఓను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహా కుంభాభిషేకం మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశముందని, వేడుకలను విజయ వంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. మహా కుంభాభిషేకం మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మికంగా గొప్ప అనుభూతిని కలిగిస్తాయని, దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఏర్పాట్లకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై జనరల్ మేనేజర్‌కు వినతి



**విశ్వంభర, భూపాలపల్లి:** సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టి ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కు సింగరేణి ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. కేటీకే ఫైవ్ ఇంక్లైన్ మ్యాన్ రైడింగ్ పొడగింపు, కొత్త టబ్బులు క్వాలిటి ఉండడంలేదని, టబ్బు రిపేరు, సామానులు సరిగా రావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. వీల్స్, బోలోట్స్ మొదలగు మేటిరియల్ నాసిరకం వస్తున్నాయి అని బుట్లు మరియు, సాక్స్ లు క్వాలిటీ ఉండడంలేదు అన్నారు.క్యాంటీన్‌లో క్వాలిటీ మరియు యూనిట్స్ పెంచాలి అని అన్ని గనుల రేకుల షెడ్-రిషెర్స్ చేయాలి అని రేకులు అన్ని పగిలి పోయి ఉన్నాయి రిపేర్ చేయించాలి అని విన్నవించారు. ఎండ తీవత్రను తట్టుకోవడానికి కార్మికులకు మజ్జిగ ప్యాకెట్స్ అందించాలి అని అలాగేమహిళ కార్మికులకు గనుల పైన సరిఅయిన వసతులు కల్పించాలని కోరడం జరిగింది. దానికి స్పందించిన జనరల్ మేనేజర్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజయ్య,నాయకులు దాసరి జనార్ధన్, నామాల శ్రీనివాస్, ఈరెంటి శ్రీధర్ పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యవంతులుగా ఉంటారు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** విద్యార్థులు చిన్నప్పటి నుండే క్రీడలను అలవాటు చేసుకుంటే జీవితాంతం ఆరోగ్యవంతులుగా ఉంటాం ని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్ నగర్ స్టేడియంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ మీట్ 2025కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలను పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించాలని అన్నారు. ఇలాంటి క్రీడలను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులలో పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. ఈ పాఠశాలలో పలు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డ్రగ్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, జిల్లా క్రీడా అధికారి వెంకటేశ్వరరావు, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా ట్రెజరర్ శ్రీనివాసరావు, మీనేందెర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, నాయకులు పెండ్యాల నగేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామ్ నరహ గౌడ్, లోకసాని కొండల్ రెడ్డి, సాజిద్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

# జిల్లాలో ముగిసిన ఆపరేషన్ స్మైల్

- 197 మంది బాలల గుర్తింపు
- బాలల రక్షణకోసం నిరంతర తనిఖీలు నిర్వహిస్తాం
- బాలలను వెట్టిచాకిరికి గురిచేస్తే చర్యలు తప్పవు
- బాలల వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- సన్ ప్రీత్ సింగ్ ఎస్పీ సూర్యాపేట జిల్లా



**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లాలో జనవరి నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్ట్మెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పగడ్బందిగా నిర్వహించామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీ గురవుతున్న 197 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షులకు క్షేమంగా అప్పగించడం జరిగినదని అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలురులు 82 మంది, బాలికలు 15 మంది ఉన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన బాలురు 75 మంది, బాలికలు 22 మంది ఉన్నారని ఎస్పీ తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరినీ గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగినది అన్నారు. ఆపరేషన్ స్మైల్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని చేరేలా సిబ్బంది అందరూ బాగా పని చేశారు. భాలల రక్షణలో తనిఖీలు నిరంతరంగా నిర్వహిస్తామని అన్నారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి అని కోరారు. వెట్టిచాకిరి గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. రెస్క్యూ ఆపరేషన్స్ ద్వారా 197 మంది పిల్లలను గుర్తించడంలో బాగా పని చేసిన పోలీసు సిబ్బంది, జిల్లా బాల రక్షణ అధికారులను, వివిధ శాఖల సిబ్బంది అందరినీ అభినందిస్తున్నాను అని ఎస్పీ తెలిపారు. చదువులతో మంచి భవిష్యత్తు ఉన్నది అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి, ప్రభుత్వాలు ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్నాయి, పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలి తల్లిదండ్రులకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ట్రాన్స్ జెండర్‌కు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తాం

### సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




**విశ్వంభర, సూర్యాపేట:** ట్రాన్స్ జెండర్లుకు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ జిల్లా లోని ట్రాన్స్ జెండర్‌ల సమస్యల గురించి అధికారులతో, ట్రాన్స్ జెండర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ ల సమస్యల పరిష్కారానికి జిల్లా సంక్షేమ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించటం జరిగిందని ట్రాన్స్ జెండర్ లు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా సంక్షేమ అధికారికి తెలియజేయాలని సూచించారు. ట్రాన్స్ జెండర్ లు ఆధార్ కార్డులో మార్పులు చేయుటకు ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఈ డీయం ని ఆదేశించారు. ట్రాన్స్ జెండర్లు తమ గుర్తింపు కార్డుల కోసం నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ అనే పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పరిశీలన తదుపరి జిల్లా కలెక్టర్ గుర్తింపు కార్డులు జారీ చేయటం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కే.నరసింహ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, సీ డీ పీ ఓ రూప, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ చైతన్య, మున్సిపల్ సిబ్బంది, మెప్మా అధికారులు, ట్రాన్స్ జెండర్ లీడర్ బానోతు శ్రీ లేఖ సిబ్బంది, పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర, దేవరుప్పుల:** జనగాం జిల్లా దేవరుప్పుల మండలంలోని కోల్కొండ, ధర్మాపురం పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించారు. 'స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్' కింద పాఠశాలల్లో విద్యార్థుల వసతికి అవసరమైన టాయిలెట్ రిపేర్, డ్రింకింగ్ వాటర్, గ్రావెల్ ఫిల్లింగ్ మొదలగు పనుల అవసరాన్ని అడిషనల్ కలెక్టర్ పర్యవేక్షించారు ఆ పనులు చేయించడానికి ఒక్కో పాఠశాలకు రూపాయలు రెండు లక్షల వరకు ఫండ్ కేటాయించారు. మండలంలోని చిన్నమడూరు ఉన్నత పాఠశాల, పెద్ద మడూరు ప్రాథమిక పాఠశాలకు కూడా ఈ పనులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులను సమ కూర్చుతున్నామని, ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు మంచి దారులు వేయాలని సూచించారు. దేవుని గుట్ట తండా లోని అంగన్వాడీ సెంటర్ ను ధరావత్ తండా లోని అంగన్వాడి సెంటర్ లను కూడా అడిషనల్ కలెక్టర్ సందర్శించి అక్కడి అవసరాలను పరిశీలించి పనులను సూచించారు. ఎంఈఓ జి కళావతి, డీఈ రామలింగా చారి, ఎంపీఓ సురేష్ కుమార్, ఏఈ మహేష్, ప్రధానోపాధ్యాయులు శివాజీ, వెంకన్న పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**విశ్వంభర, హైదరాబాదు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మికవర్గానికి, రైతాంగానికి, ప్రజలకు ఏమాత్రం అనుకూలంగా లేకుండా బడా పెట్టుబడిదారులకు, బడా వ్యాపారవేత్తలకు, కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్‌ను రూపొందించి పేదలకు, కార్మికవర్గానికి ఏ ప్రయోజనం చేకూర్చని నికృష్టమైన బడ్జెట్ అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని తీవ్రంగా ఖండిరచారు. కార్మికులు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించిన 44 కార్మిక చట్టాల నుండి 29 చట్టాలను పూర్తిగా సవరించి 4కోడ్‌లు తెచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో పాలన కొనసాగించటం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశంలోని కార్మికవర్గానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశించిన కార్మికవర్గం ఆశలను అడియాశలు చేయటాన్ని వారు తప్పుబట్టారు. ఢల్లీ నడివీధిలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని చేసిన పోరాటాన్ని, ఆందోళనలను గౌరవించకుండా రైతులు వ్యతిరేకిస్తూ రైతు ఉద్యమ నేత డ్లెలేలామా గత 70 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా పట్టించుకోని రైతు వ్యతిరేక ప్రభుత్వం మోడీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని వారు విమర్శించారు. మోడీ నాయకత్వాన ఉపాధి హామీ కార్మికులు పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తుంటే వారి పొట్టలు కొట్టి కోటి 55 లక్షల మందిని ఉపాధి హామీ పథకానికి దూరం చేయటాన్ని వారు ఖండించారు. ఈ బడ్జెట్‌లో సంపన్నుల ఆదాయంపై 4శాతం పన్ను వసూలు చేస్తామని ప్రకటించటం మరొకవైపు మధ్యతరగతి ఆదాయపరిమితి 12 లక్షలు దాటితే 20శాతం ఆదాయపు పన్నులు వసూలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటాన్ని వారు తీవ్రంగా ఖండిరచారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాపితంగా కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5న నిరసనలు తెలియజేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నేడు హైదరాబాద్‌లోని లిబర్టీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్రంలోని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీఆర్‌ఎస్‌కేవీ, టీయూసీసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐయూటీయూసీ, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగన్న ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ శ్రీనివాస్, బీఆర్ఎస్‌కేవీ రాంబాబు, ఏఐయూటీయూసీ భరత్, ఆర్టీసీ జేఏసీ నాయకులు వెంకన్న, జేఏసీ కన్వీనర్ తామస్ రెడ్డిలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షవర్గంగా ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సీఐటీయూ జె.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ అనురాధ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నుండి పి.వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, సి.హెచ్.శ్రీనివాస్, సిహెచ్.జంగయ్య, బిక్షపతి యాదవ్, మల్లేష్, నెర్లకంటి శ్రీకాంత్‌లతోపాటు వందలాది మంది కార్మికులు కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మతి భ్రమించింది: వినయ్ రెడ్డి



**విశ్వంభర, ఆర్మూర్:** ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగనన చేసిన రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి రాకేష్ రెడ్డికి మతి భ్రమించినట్టు భావిస్తున్నామని తెలిపారు. రోజుకో మాట, పూటకు అబద్ధం మాట్లాడే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే రాకేష్ రెడ్డి అని గుర్తు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయడం మానేసి కులచిచ్చు, మతసిచ్చు, పెట్టే విధంగా మాట్లాడడం రాకేష్ రెడ్డికి అలవాటనని వినయ్ రెడ్డి ఏద్దేవా చేశారు. ఇప్పటికైనా సైకాలజిస్ట్‌కు చూయించుకుని నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని హితావు పలికారు. ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతామనని పిచ్చి మాటలు మాటలు మాట్లాడుతు న్నాడని విమర్శించారు. రాకేష్ రెడ్డి మాట్లాడే మాలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాలు సాధిస్తుందని వినయ్ రెడ్డి తెలియజేశారు.

## కెపాసిటర్లతో విద్యుత్ ఆదా

### రైతు పొలం బాటలో డీఈ విజయ్



**విశ్వంభర, ఇనుగుర్తి:** మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే 15 శాతం విద్యుత్ ఆదా అవుతుందని డీఈ విజయ్ రైతులకు సూచించారు. మండల కేంద్రం ఇనుగుర్తిలో ఎన్ డీ ఇనుగుర్తి సెక్షన్ ఆధ్వర్యంలో సుంకరి శివ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం విద్యుత్ శాఖ రైతు పొలం బాట నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు అధికారులకు వివరించారు. వెంటనే పరిష్కరించాలని డీఈ తమ ఉద్యోగులకు సూచించారు. పలు సూచనలు ఇస్తూ.. ప్రమాదాలను ఎలా నియంత్రించుకోవచ్చో చెప్పారు.ఆటోమేటిక్ ట్రాన్సర్లు వాడితే ట్రాన్స్ఫార్మర్లపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. ఏడీ ప్రశాంత్ ఏఈ రాజు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగించుకోవాలి, దుర్వినియోగం చేయొద్దన్నారు. లైన్మెన్ యశ్వంత్, ఏఎల్ఎం అంబేద్కర్,దేవులపల్లియాకన్న, రమేష్, శంకర్ రైతులు సుంకరి రజిని, యాకూబ్రెడ్డి, రాజాలు, మహేందర్, చంద్రు, మల్లయ్య, మహేష్,బుచ్చిరెడ్డి ఐలయ్య,జనయ్య,నరేష్ పాల్గొన్నారు.

## పి.ఎ.సి.ఎస్ ఛైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డికి పితృ వియోగం

### సంతాపం తెలిపిన ఎమ్మెల్యే వీరేశం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ముత్తిరెడ్డి గూడెంకు చెందిన రామన్నపేట మండల పి.ఏ.సి.ఎస్ ఛైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి తండ్రి నంద్యాల క్రిష్ణారెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందగా, వారి పార్థివదేహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి, అంజలి ఘటించి, బిక్షంరెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలానికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బైండ్ల కులాన్ని ఎస్సీ ‘బి’ లో చేర్చడం అన్యాయం

### సంఘం రాష్ట్ర నేత యాలాద్రి



**విశ్వంభర, నెల్లికుదురు:** యధావిధిగా ఎస్సీ‘బీ’లో ఉంచడం బైండ్ల కులానికి తీవ్ర అన్యాయమేనని బైండ్ల కుల సంఘం రాష్ట్ర నాయకులు జిలకర యాలాద్రి అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నిజానికి 50 వేల జనాభా ఉన్న బైండ్ల కులాన్ని 2001లో 13 వేలుగా ఉన్నట్లు నాటి గణనలో ఆనాటి ప్రభుత్వం సూచించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బైండ్ల ను ఎస్సీ ‘ఎ’ కి మార్చాలని ఎస్సీ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ, మాదిగ, మాలలు కుట్ర చేసి వర్గీకరణ పేరుతో బైండ్లను మోసం చేశారన్నారు. వెంటనే ఎస్సీ ఏ లోకి మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బైండ్ల కులం కోసం పోరాడని ప్రజాప్రతినిధులు తక్షణమే రాజీనామా చేయాలన్నారు.

## ఉద్యోగుల బాధ్యత అత్యంత కీలకం



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగుల భాధ్యత అత్యంత కీలకమని, విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో గ్రూప్-4 ద్వారా ఎంపికై కలెక్టరేట్ లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ సహాయకులతో ముకాముఖీ అయ్యారు. ముందుగా గ్రూప్ 4 ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో అంకితభావం, సేవా దృక్పథంతో పని చేయాలని, వివిధ సేవల నిమిత్తం ప్రజలు వస్తుంటారని సేవల్లో మన్ననలు పొందాలని సూచించారు. ఫైల్స్ నిర్వహణలో ఏదేని సలహాలు, సూచనలు కొరకు పై అధికారులు సూచనలు తీసుకోవాలని, పెండింగ్ లేకుండా ఎప్పటి కపుడు క్లియర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అంకితభావం, నిబద్ధత మరియు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. విధులను నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. నూతనంగా ఉద్యోగంలో చేరారని, మీరందరు ఎంతో కృషి పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించారని, ఆ స్ఫూర్తి, పట్టుదలను విధుల నిర్వహణలో పాటిస్తూ ప్రజలకు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని సూచించారు. ఈడీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విశ్వంభర క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, ఎల్బీనగర్:** విశ్వంభర దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ 2025 ను ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంభర దినపత్రికకు మంచి ఆదరణ లభించాలని, నేటి పోటీ ప్రపంచంలో మిగతా పత్రికలకు దీటుగా రాణించాలని ఆకాంక్షించారు. నిజాలను నిర్భయంగా వెలికి తీయాలని, ఏ పార్టీకి కొమ్ము కాయకుండా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులకు పాలకులకు వారధిగా ఉండాలని అన్నారు. నవీన్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, విశ్వంభర దినపత్రిక జనరల్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్‌లు



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డిస్ట్రిబ్యూటర్లు రైతులను మాయమాటలు చెప్పి తమ కంపెనీ విత్తనాలు బాగా ఉన్నాయని రైతు ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేసి. అమాయకప్రజలకు మందు, విందు ఆశ చూపిస్తున్నారు. మా కంపెనీ విత్తనాలు ఎకరానికి 25 క్వింటాల నుండి 35 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని తెగులు తట్టుకుంటుందని రైతులకు ఎరవేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లు ఒక మంచి తోటను ఎంచుకొని తెల్లవారక ముందే గ్రామాలలో వాహనాలను ఏర్పాటు చేసి ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి తరలిస్తూన్నారు. ఇది తమ కంపెనీ విత్తనాలని చెప్పి రైతులను అడ్డంగా బుక్ చేస్తున్నారు. వాస్తవానికి వాళ్ల కంపెనీ కాకపోయినా మా కంపెనీ విత్తనాలని చెపుతున్నారు. సందర్శనకు వచ్చిన రైతుల నుండి వివరాలు సేకరించి మా కంపెనీ విత్తనాలను వేసుకోవాలని సూచిస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లు యొక్క మాయలో పడి ఏ విత్తనాలు వేయలో రైతులు కు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. గతేడాది వాతావరణం అనుకూలించకపోవడంతో తెగులు, వైరస్ సోకి ఎకరానికి ఐదు నుండి 10 క్వింటాలవరకు దిగుబడి వచ్చింది. రైతులు అప్పుల ఉబ్బిలో మునిగి తేలుతున్నారు. ఈ సీజన్లో వాతావరణం కొంత అనుకూలించడంతో మిర్చి తోటలు బాగున్నాయని తెలియడంతో డిస్ట్రిబ్యూటర్లు గ్రామీణ ప్రాంతంలో రైతులను ఎరవేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎంత జరుగుతున్న మండలాలలో వ్యవసాయ శాఖ అధికారుల ఇదంతా మాకెందుకులే అని దాటి వేస్తున్నారు.

## మైనర్లు స్కూల్లోకి వాహనాలు తీసుకెళ్లొద్దు



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్బంగా పట్టణంలోని పలు పాఠశాలలో విద్యార్థులకు మైనార్లు వాహనాలు పాఠశాలలోకి తీసుకెళ్లొద్దు ప్రమాదలకు బాధ్యులు కావొద్దు అని ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని పలు పాఠశాలలో 8,9,10 వ తరగతి విద్యార్థులు సైకిల్లకు బదులుగా ద్విచక్ర వాహనాలు పాఠశాలలకు తీసుకెళ్లి మైనార్లుగా అతివేగంగా ప్రయాణాలు చేసి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది అని ఈ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు దయచేసి పిల్లలకు వాహనను ఇచ్చి పాఠశాలలకు పంపరాదు అని సూచించారు. అనంతరం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ, అజయ్,ప్రవీణ్, సాయి,సేవా బృందం గౌరవ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, రవిగౌడ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రామలింగేశ్వరుడి కళ్యాణ మహోత్సవం

### శివనామస్మరణతో మార్మోగిన చెర్వుగట్టు

### పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించిన ఎమ్మెల్యే వీరేశం దంపతులు



**విశ్వంభర,నార్కెట్ పల్లి:** నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేడుకలు బుధవారం తెల్లవారుజామున అర్చక బృందం వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించారు. స్వామి వారి కళ్యాణ వేడుకలను జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తిలకించారు. గుట్టపై జనసంద్రంగా మారింది. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హడావుడిగా కులగణన సర్వే చేయటం సరైనది కాదు

### ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు: కంటే కేశవ గౌడ్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కులగనన సర్వే చేయటం సరైనదికాదు అని, రాష్ట్రంలో ఏ గ్రామంలో ఏ కులాలు ఎన్నిఓట్లు ఉన్నవి అని తెలపకుండా తూతూమంత్రంగా చేపట్టటం సరైనది కాదని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగనన ఆమోద్య యోగంగా లేదన్నారు. బీసీ కులాల ఓట్లు అధికంగా ఉన్నాయని, గత సర్వేలో ఎక్కువ శాతం వస్తే ఈసారి తక్కువగా వచ్చాయని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా ఎస్సీ, బీసీ, ఓసీ, ఎస్టీల ఓట్లను కులగనలను వివరించాలని తెలిపారు. బీసీలంతా ఒక్కటై సీట్లు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

## శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**విశ్వంభర, డిండి:** డిండి మండల చెరుకుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొలువైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్లు రావు, నాగార్జున రెడ్డి రెడ్డి, సుమిత్ రెడ్డి, శశిధర్ రెడ్డి,లక్పతీ నాయక్, ఢిల్లీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీద సాయి, డిండి మాజీ ఉపసర్పంచ్ నూకం వెంకటేష్,అవుట మల్లేష్, బుల్లె శైలేష్,మాధమూని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని సహాయ కార్మిక అధికారి కార్యాలయంనందు మంగళవారం నాడు అంజలి టీవీ క్యాలెండర్ ను సహాయ కార్యదర్శి ప్రవీణ్ చందు, జూనియర్ సహాయకులు సిహెచ్ యాదయ్య, సంతోష కుమారి, మహేష్ కుమార్, ప్యారా లీగల్ వాలంటర్ కానుగంటి శ్రీశైలం పాల్గొని ఆవిష్కరించారు.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**విశ్వంభర, నెల్లికుదురు:** ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసనసభ శాసన మండలి లలో ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షులు కారెం ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ స్థానిక అంబేద్కర్ సెంటర్లో బుధవారం దహనం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్టి మల్ల మహేష్ మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దుచేసి దళితుల ఐక్యత కోసం 20 శాతం రిజర్వేషన్లను పెంచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దాసరి యాకయ్య,చదల యాకాంతం,మద్దెల రమేష్, బాణాల సంజీవ,బుర్గుల రజనీకుమార్,పగిడిపల్లి రాములు,ఆరె ఐలయ్య,బేతమాల్ల వెంకటయ్య,బింగి వెంకన్న,ఎడ్ల వెంకటయ్య,కాటమల్ల వెంకన్న,కారం రవి,ఇర్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులు వేశారు నీటిసరఫరా మరిచారు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సీపీఐఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పద్మశాలి కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గ సభ్యులు కందుల హనుమంతు, పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి పద్మశాలి కాలనీలో మిషన్ భగీరథ వాటర్ రావడం లేదని, కాలనీ ప్రజలకు నీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి ఎండలు తీవ్రతమవుతూ ఉన్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకొని మైనార్టీ కాలనీలో ఉన్న ట్యాంక్ పైప్ లైన్ లీకేజీలను నివారించి గ్రామపంచాయతీ అధికారులు చొరవ తీసుకొని కాలనీ ప్రజల ఇబ్బందులు తొలగించాలని వారి డిమాండ్ చేశారు. లేనియెడల కాలనీ ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం మండల కమిటీ సభ్యులు గాదె నరేందర్, గొరిగే సోములు, పల్లె సత్యం, అప్పం సంతోష్, గంజి అశోక్, కుందూరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు పోరాడుదాం



**విశ్వంభర, హైదరాబాదు:** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను సవరించే వరకు ఐక్యంగా ఉద్యమిద్దామని హైదరాబాదులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో జరుగు నిరసనలలో భాగంగా ధర్నా కార్యక్రమం జరిగింది. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను సవరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దని, ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత విధించొద్దని, రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదాను రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టీ సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, ఏఐటీయూసీ నాయకులు ప్రేమ్ పావని ,ఐ.ఎన్.టి.యు.సి నాయకులు నాగన్న గౌడ్, బి.ఆర్.ఎస్.కె.వి నాయకులు రాంబాబు, టి.యు.సి.ఐ నాయకులు సూర్యం, ఐ.ఎ.ఫ్.టి.యు నాయకులు ఎం శ్రీనివాస్, యు.టి.యు.సి నాయకులు భరత్, రైతు సంఘాల నాయకులు మామిడాల బిక్షపతి, భాస్కర్ లు మాట్లాడుతూ 2025–26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయం అని అన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 11 సంల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించింది. రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపును విస్మరించింది. విద్యుత్ రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనున్నది. బీమా రంగంలో ఎఫ్‌డిఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించింది. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం రూ.26,000ల డిమాండ్, స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025–26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేష్, జయలక్ష్మి, ఈశ్వరరావు, కూరపాటి రమేష్, పద్మశ్రీ, రైతు సంఘం నాయకులు సంధ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పని పద్మ, కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

## సీఎం రేవంత్ రెడ్డికి రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి



**విశ్వంభర, బషీర్‌బాగ్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీ కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో పాటు మర్యాదపూర్వకంగా కలిసి బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ బీసీలందరికీ సమాజంలో సముచితమైన గౌరవం, స్థానం కల్పించాలన్న ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీల అభివృద్ధికి ముందడుగు పడిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కులగణన చేపట్టాలని దేశంలోని బీసీలు గల్లి నుండి ఢిల్లీ దాకా పోరాటం చేస్తున్నా కూడా ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని, బీసీ ప్రధాని అని గొప్పగా చెప్పుకునే బీజేపీ కూడా సమగ్ర కులగణన చేస్తామని హామీ ఇచ్చి మూడు సార్లు అధికారంలోకి వచ్చింది కానీ కుల గణన చేపట్టలేదని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయని దుస్థితిలో బీజేపీ ఉందన్నారు.గొంతు చించుకుని అరుస్తున్న బీఆర్ఎస్ నాయకులు 2014 లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు.బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి వస్తోందని, ఆ లెక్కలు వెల్లడించకుండా బీసీలను రాజకీయంగా అణచివేశారని కేసీఆర్ పై మండిపడ్డారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసి, బాధ్యత గల ప్రతిపక్ష నేతగా ఉంటూ సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ , మాజీ మంత్రులు హరీష్,కేటీఆర్ లకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టడమే గాక వెల్లడించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కిందన్నారు. ఇప్పటివరకు సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వాలు సొసైటీ అధ్యక్షులకు, డీసీసీబీ చైర్మన్లకు మాత్రం కల్పించలేదని, రాబోయే సింగిల్ విండో ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. పాలమూరు బిడ్డ ఇవాళ దేశానికే ఆదర్శంగా నిలవడమే గాక దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేశారని రేవంత్‌ను కొనియాడారు.

# వికలాంగునికి వీల్ ఛైర్ వితరణ

## దివ్యాంగుని కన్నీళ్ళు తూడ్చిన సహస్ర ఫౌండేషన్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని బాబునాయక్ తండాకు చెందిన నరేష్ పుట్టుకతోనే వికలాంగుడిగా జన్మించాడు. ఇతనికి పుట్టుకలోనే పోలియోరావడంతో కాళ్ళు, చేతులు లేకుండా కదలలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు . నరేష్ తల్లిదండ్రులు మరణించడంతో నరేష్ పెద్దమ్మ అన్నీ తానై పోషిస్తుంది. ఆదుకునే వారికోసం అనేకమందికి మొంపెట్టుకుంది. ప్రభుత్వం ఇచ్చే వికలాంగుల పెన్షన్ తప్ప మరో సహాయం మాత్రం అందలేదు. కనీసం బయటకు, లోపలకు తీసుకువెళ్ళడానికి వీల్ చైర్ అయినా ఇప్పించండి అంటూ పలుమార్లు ప్రభుత్వకార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఏ మాత్రం లేకపాయే మరికొందరి మిత్రుల ద్వారా బాబు నాయక్ తండాకు చెందిన నరేష్ దీన పరిస్థితిని తెలుసుకున్న వరంగల్‌లోని సహస్ర ఫౌండేషన్ బాధ్యులు స్పందించారు. విషయం తెలిసి 24గంటలు కూడా కాకముందే వరంగల్ నుంచి వారు నేరుగా బుధవారం మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని బాబునాయక్ తండాలో ఉన్న నరేష్ ఇంటి వద్దకు వీల్ చైర్‌తో సహా చేరుకున్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ చేతులమీదుగా వీల్ చైర్‌ను నరేష్‌కు అందజేసారు. మీరు నిండునూరేళ్ళ చల్లంగ బ్రతకాలి బిడ్డ అంటూ సహస్ర ఫౌండేషన్ బాధ్యులను దీవించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలోనూ సహస్ర ఫౌండేషన్ వరంగల్ జిల్లాలో అనేక మంచి కార్యక్రమాలు చేపట్టిందని, పుట్టు దివ్యాంగునికి వీల్‌చైర్ విరాళంగా ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆశీస్సులు అందజేసారు. మరింత మంది దాతలు స్పందించి నరేష్‌కు సహాయం చేయాలని కోరారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, సహస్ర ఫౌండేషన్ బాధ్యులు అజ్మీర్, ప్రవీణ్, భరత్, రాజు, వినయ్, శివ, విష్ణువర్ధన్, మణిదీప్, బాబునాయక్ తండావాసులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ సాధన, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి

## సీపీయం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**విశ్వంభర, హైదరాబాదు:** అసమానతలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం, సామాజిక న్యాయ సాధన కోసం, శ్రామికుల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా లాల్, నీల్ శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీయం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత పై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సు కు ముఖ్య అధిదిగా హజరైన జాన్ వెస్లీ మాట్లాడుతూ అణగారిన వర్గాల,శ్రామికుల దళితుల అనైక్యతలు రాకుండా విశాల ఐక్యత దృక్పథంతో సంఘటిత ఉద్యమం చెపట్టాలన్నారు. భూమి, వనరులు, బడ్జెట్‌లను సాధించుకొవాలన్నారు. అణగారిన వర్గాల అంతిమ లక్ష్య సాధనకు మార్క్స్, పూలే,అంబేద్కర్ ఆశయ సాధన కొసం పాటుపడాలన్నారు. జాన్ వెస్లీకి అత్మీయ సన్మానం సీపీయం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వెస్లి ని డీబీఎఫ్ అత్మీయ సన్మానం చెసింది. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమా ర్, సినియర్ దళిత నేత జెబి రాజు, జాతీయ అంబేద్కర్ సంస్ధ నేత యం.నర్సింగ రావు, ప్రొపెసర్ తడ్క యాదగిరి, టిపియస్ కె.ప్రతి నిధి రాములు,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెంకట్రాములు, ప్రసాద్,పద్మ, కెవిపియస్ నేత స్కైలాబ్ బాబు,డీబీఎఫ్ నేతలు పి.శంకర్,డి.సంజీవ్ పులి కల్పన, మెట్ల శంకర్,చుంచు రాజేందర్, దాసరి ఎగొండ స్వామి,ఉమ, యాదమ్మ, హైకోర్టు న్యాయవాది దివాకర్,ఎస్ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెదాంత్ మౌర్య,జాన్ మైఖెల్,గొల్లపల్లి దయానంద్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణి లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేసిన సబిత

**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కందుకూరు మండల పరిధిలో మంజూరైన కళ్యాణి లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన మాజీ మంత్రివర్యులు మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కళ్యాణి లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కందుకూరు మండల కుల గణన సర్వేలో ఏఏ కులం ఎంత మంది ఉన్నారని మండల అధికారులను అడగగా మా వద్ద వివరాలు లేవు మేము రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించామని చెపుతున్నారన్నారు. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడం కాదు ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీలకు 42 శాతం ఇస్తామన్న రిజర్వేషన్లు కల్పించండి పిల్లకు ఉద్యోగాలు, సీట్లు వస్తాయన్నారు. మీ సర్వే మండల లీడర్ల ముందు పెడితే వారి ఊర్లలో ఏ ఏ కులం ఎంతమంది ఉన్నారు మీరు ఇచ్చిన వివరాలు కరెక్టుగా ఉన్నాయా లేవా వాళ్ళు గుర్తిస్తారని అన్నారు. ఇక జనవరి 26 రోజున ఇస్తామన్న రేషన్ కార్డులు, రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు,సంపూర్ణంగా రుణమాఫీ, మహిళలకు 2500 ఎక్కడపోయినాయి అని ఇవన్నీ ఇవ్వకుండా బూటకపు మాటలతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో కళ్యాణి లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకు కృషి చేస్తా

### కుత్బుల్లాపూర్ ఇన్చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ, వార్డ్ ఎల్ జి విస్టాస్ లేఔట్ మరియు ప్రిథ్వి ,అద్విక్ అపార్ట్మెంట్స్ కాలనీలో మౌలిక సదుపాలయాలు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత రెండు రోజుల క్రితం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినపించుకోగా బుధవారం హన్మంతన్న కాలనీ కి వెళ్లి రోడ్లు పరిశీలించి కమీషనర్ తో మాట్లాడి వీలైనంత త్వరలో సీసీ రోడ్ మరియు డ్రైనేజీ స్పెషల్ ఫండ్స్ ద్వారా మంజూరు చేసి పనులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్ మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, జయభేరి గోపాల్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, అశోక్ రెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, భాగ్య రెడ్డి, నరేందర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ

## నల్గొండ జిల్లా అనపర్తి ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్

### హాజరై ఫైరింగ్ చేసిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఇతర పోలీసు అధికారులు



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రతి సంవత్సరం నిర్వహించే పోలీసు వార్షిక మోబిలైజేశన్‌లో భాగంగా జిల్లా పోలీసు సిబ్బందికి ఆయుధ పరిజ్ఞానం, ఫైరింగ్ నిర్వహణపై శిక్షణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు అర్మడ్ రిజర్వు అదికారుల పర్యవేక్షణలో నల్గొండ జిల్లా అన్నేపర్తి బెటాలియన్ ఫైరింగ్ రేంజ్ నందు సూర్యాపేట జిల్లా పోలీసులకు ఫైరింగ్ నిర్వహించారు. బుధవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అధనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ లు హాజరై ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగినది. జిల్లాలో ఉన్న 500 మంది పోలీసు సిబ్బంది ఈ ఫైరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల నిర్వహణలో, శాంతి భద్రతల రక్షణలో సాంకేతికత తోపాటు ఆయుధ పరిజ్ఞానం అవసరం ఉంటుందని తెలిపారు. పోలీసు సిబ్బంది అందరూ ఫైరింగ్ చేయాలని తెలిపారు. దీనిలో భాగంగానే సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహిస్తున్నాం అని తెలిపినారు. ఏఆర్ అధనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి, ఏఆర్ అడ్మిన్ ఇన్స్పెక్టర్ నారాయణ రాజు ఫైరింగ్ ప్రాక్టీస్ ను పర్యవేక్షణ చేశారు. ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్, సాయిరాంలు ఫైరింగ్ రేంజ్ నందు విధులు నిర్వర్తించారు.

# తాటి చెట్ల నష్టపరిహారం గౌడ సొసైటీలకే ఇవ్వాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్న సందర్భంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి, మండలాలలో వేలాది తాటి చెట్లు నేలమట్టం అయిపోతున్న సందర్భంలో శాశ్వత జీవనోపాధి కోల్పోతున్న గౌడన్నలకు ప్రభుత్వం నుంచి అందించే నష్టపరిహారాన్ని ఆయా సొసైటీలకు అందించి గౌడన్నలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ లకు బుధవారం రోజున గౌడ సంఘం నాయకులు వినతి పత్రాలను అందించడం జరిగింది. అలాగే దాని ప్రతిని ఎక్సైజ్ సెక్షన్ ఆఫీసులో ఇవ్వడం జరిగింది. గౌడ సంఘం తరపున నవా బుపేట గ్రామ పెద్దలు కసిరెడ్డి రత్నాకర్ రెడ్డి, జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మ శంకర్ గౌడ్, నవాబుపేట గౌడ సంఘం సొసైటీ అధ్యక్షులు పొన్నం శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు అనగాని రాజయ్య గౌడ్, కాసగాని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# శివాలయం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ ప్రాచీన ఉమామహేశ్వర దేవాలయం జాతర వాల్ పోస్టర్లను శివాలయ ఛైర్మన్ పాలకూర్ల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుండి 27 వరకు జరిగే శివాలయం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఉపవాస దీక్షలు విరమణ అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పాలకుర్ల గిరి గౌడ్, పాలకుర్ల యాదయ్య గౌడ్, సోమనబోయిన కృష్ణకుమార్ యాదవ్, పట్నం రాములు, పాలమురి రాజమౌళి,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీది బీసీలపై కపట ప్రేమ

## బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు అజయ్ కుమార్ యాదవ్

**విశ్వంభర, బషీర్‌బాగ్:** కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలల్లో 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధత కల్పించలేమనీ, రాజ్యాంగ సవరణ చేయాలని మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాననడం బీసీల దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కామారెడ్డి డిక్లరేషన్ హామీని ప్రకటించినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులకు చట్టబద్ధత కల్పించాలనే ఆలోచన తెలియకుండానే డిక్లరేషన్ హామీని ప్రకటించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు.మంత్రి వర్గంలో బీసీలలో అధిక జనాభా ఉన్న యాదవులకు, ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఒక్క మంత్రి కూడా లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సర్వే వివరాలల్లో ప్రధానంగా బీసీ జనాభాను చాల తక్కువగా చూపించరన్నారు. గ్రామాల వారీగా బీసీ కులాల వివరాలు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వారికిఅవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిక్లరేషన్ హామీ ఉత్తదే అయిందన్నారు.

# జిల్లా కమిటీకి ఎన్నికైన ఫోటో గ్రాఫర్స్‌కి సన్మానం

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్స్ జిల్లా కమిటీలో ఉపాధ్యక్షులుగా పాలకూర్ల యాదయ్య గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి గా ఎస్.కె పాషలు ఎన్నికైన సందర్భంగా మండల కమిటీ నుండి సన్మానించడం జరిగింది. ఎన్నికైన ఫోటోగ్రాఫర్స్ మాట్లాడుతూ మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఫోటోగ్రాఫర్ సమస్యల కోసం అనునిత్యం పోరాడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓరుగంటి లింగస్వామి, చిలువేరు శంకర్, చిలువేరు శేఖర్,చిలువేరు రమేష్,నీళ్ల రాజు,చెర్ల మహేష్,నీళ్ల శివ,గంగాపురం సాయి,మందుగుల సాయి కిరణ్,నీళ్ల కిరణ్,బొంగు మధు,వీరమల్ల శ్రవణ్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి

**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండల కేంద్రంలోని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఎన్టీఆర్ 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేవల్లె గోపాల్, కడమోని ప్రభాకర్, మహేశ్వరం ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ రేవల్లే గిరి సాయి, కొండ్ర శివ, మోథీ సాయి, రెవల్లె చందు, కట్నం రాఘవేందర్, డీజే యాదగిరి, మోతే మహేష్, కొండ్ర సాయి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వశక్తితో ఎదగాలి

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వద్దె సాయి కుమార్ నూతన ఎం.ఎస్. డిజిటల్ ఫోటో స్టూడియో ను ప్రారంభించిన మాజీ ఎం.పీ.పీ సీ.ఎల్. శ్రీనివాస్ యాదవ్ గ్రామస్తుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి వద్దె సాయి కి అభినందనలు తెలిపారు. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు లోనవ్వకుండా ఉద్యోగం రాలేదని బాధపడకుండా స్వశక్తితో వ్యాపారం చేయడం వల్ల జీవితంలో ముందుకు వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబర్ రహమాన్, ఈనాడు రిపోర్టర్ విష్ణువర్ధన్ యాదవ్ బాల కుమార్ గౌడ్, శేఖర్ రెడ్డి,ఆరిఫ్, శ్రీరామ్, ఆంజనేయులు, నాగరాజు, అబ్బాస్,శేఖర్ యాదవ్, రాఘవేందర్,రాము,విష్ణు, లక్ష్మణ్,శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెంకట్రావు పేట గ్రామంలో డప్పు పెద్దయ్య చనిపోవడం జరిగింది. ఇట్టి విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ స్థానిక నాయకుల ద్వారా 3 వేల రూపాయలు ఆర్థిక సాహయం చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు శతాబ్ది టౌన్షిప్ ఎండి కాసు శ్రీనివాస్ రెడ్డి మృతుడి కుటుంబానికి 4వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాంలు, నాయకులు సురేందర్, రవి, శంకర్, వెంకట్ రెడ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ చెల్లిస్తే ఫ్రీ రేషన్ కట్..

**అనర్హుల ఏరివేత దిశగా కేంద్రం అడుగులు!**



**ఢిల్లీ:** ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలను ఆహార మంత్రిత్వ శాఖతో ఐటీ విభాగం పంచుకోనుంది. తద్వారా ఏరివేత ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చెల్లించని వారికి పీఎంజీకేఏవై కింద పేద కుటుంబాలకు ప్రభుత్వం ఉచిత రేషన్ అందిస్తున్న విషయం తెలిసిందే. 2024 జనవరి 1 నుంచి ఐదేళ్ల పాటు ఉచితంగా ఆహారధాన్యాలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.1.97 లక్షల కోట్లు వెచ్చించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తాజా బడ్జెట్‌లో రూ.2.03 లక్షల కోట్లను ప్రతిపాదించింది. దేశంలో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అనర్హుల ఏరివేతకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తాజాగా ఓ ఆఫీసు ఆర్డర్‌ను జారీ చేసింది. ఇందులో భాగంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (సిస్టమ్స్).. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆహారం, ప్రజా పంపిణీ విభాగం జాయింట్ సెక్రటరీతో సమాచారాన్ని పంచుకోనుంది. ఆధార్, పాన్, మదింపు సంవత్సరం వివరాలను సమర్పిస్తే.. నిర్ణీత మొత్తం కంటే ఆదాయం కలిగిన వారు ఉన్నవారి డేటాను డీజీఐటీ సిస్టమ్స్ అందిస్తుంది. అనర్హుల వివరాల గుర్తింపులో ఈ డేటా కీలకం కానుంది. ఈ గుర్తింపు పూర్తయ్యాక కేంద్రం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

# కర్ణాటక హైకోర్టులో విజయ్ మాల్యా పిటిషన్..

**బ్యాంకులకు నోటీసులు**




**బెంగళూరు:** బ్యాంకులకు రూ.వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యూబీహెచ్ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు. తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మాల్యా తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6,200 కోట్ల రుణాన్ని తీసుకోగా.. దీనికి సంబంధించి రూ. 14 వేల కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

''ఈ విషయం గురించి లోక్‌సభలో ఆర్థిక మంత్రి తెలియజేశారు. మాల్యాకు చెందిన రూ.14, 131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని ఆమె తెలిపారు. ఆయన తీసుకున్న రుణంలో దాదాపు రూ.10, 200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తి రుణం చెల్లించినప్పటికీ.. ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకు నుంచి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలి'' అని న్యాయవాది అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 13లోగా స్పందన తెలియజేయాలంటూ గడువు విధించింది. ఇదిలా ఉండగా.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తూన్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.

# కుంభమేళాలో భక్తుల కోసం.. రిలయన్స్ 'తీర్థ్ యాత్రి సేవ'

**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ తన దాతృత్వాన్ని చాటుకుంది. 'తీర్థ్ యాత్రి సేవ' పేరుతో యాత్రికుల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'అన్న సేవ' పేరిట కుంభమేళాకు వచ్చే భక్తులకు ఆహారం అందించడంతో పాటు.. పలు వైద్య సేవలు అందిస్తోంది.పవిత్ర జలాల్లో అత్యవసరమైనప్పుడు వినియోగించడానికి లైఫ్‌జాకెట్లు, రవాణా సదుపాయాలను కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియోను రిలయన్స్ ఫౌండేషన్ తమ 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది. ''ఆధ్యాత్మిక గురువులు, అధికారుల భాగస్వామ్యంతో యాత్రికులకు ఈ సేవలను అందించగలుగుతున్నాం. ప్రతి భక్తుడి భద్రత, ఆరోగ్యం, శ్రేయస్సు కోసం అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం'' అని రాసుకొచ్చింది.కంపా ఆశ్రమ్స్ పేరిట రిలయన్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రెస్ట్ జోన్లను నిర్వహిస్తోంది. కుంభమేళా మైదానంలో ప్రయాణికులు గందరగోళానికి గురికాకుండా మార్గాలను చూపించే బోర్డులను ఏర్పాటుచేసింది. ఇక అక్కడికి వచ్చేవారికి ఫోన్ సిగ్నల్స్‌లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా 4జీ, 5జీ బీటీఎస్‌లు, ట్రాన్స్‌పోర్ట్ టవర్లను కూడా తరలించింది. కీలకమైనచోట్ల కొత్త ఆప్టికల్ ఫైబర్ లైన్లను కూడా వేసింది. దీంతోపాటు అక్కడ విధులు నిర్వహించే పోలీసులకు నీటి సౌకర్యాలు, వాచ్ టవర్లు, బారికేడ్లను ఏర్పాటుచేశారు. ద్వారకలోని శారదా పీఠం, శంకరాచార్య ఉత్సవ్ సేవాలయా ఫౌండేషన్, నిరంజని అఖాడా, ప్రభు ప్రేమ్‌సింగ్ ఛారిటబుల్ ట్రస్ట్, పరమార్థ్ నికేతన్ ఆశ్రమంతో కలిసి రిలయన్స్ పనిచేస్తోంది.




# 'నేను నీ అయ్య సహచరుడిని.. నోరు మూసుకుని కూర్చో..'

## బీజేపీ ఎంపీపై ఖర్గే అసహనం



**ఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో సహనం కోల్పోయారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే గత సోమవారం రాజ్యసభలో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత మాజీ ప్రధాని చంద్రశేఖర్ తనయుడు, బీజేపీ ఎంపీ నీరజ్ శేఖర్ తన ప్రసంగానికి అడ్డు తగలడంతో ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా పతనమవుతోందని, కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాలే ఇందుకు కారణమని ఖర్గే ఆరోపిస్తుండగా.. బీజేపీ ఎంపీ నీరజ్ శేఖర్ అడ్డుతగిలారు. దాంతో సహనం కోల్పోయిన ఖర్గే.. 'తేరా బాప్ కా భీ మెయిన్ ఐసా సాథీ థా. తూ క్యా బాత్ కర్తా హై..? తుజ్‌కో లేకర్ ఘుమా. చుప్, చుప్, చుప్ బైట్ (నేను నీ అయ్యకు సహచరుడిని. ఏం మాట్లాడుతున్నవ్..? నీ సంగతి చెప్తా. నోర్ముయ్, నోర్ముయ్, నోరు మూసుకొని కూర్చో) అని వ్యాఖ్యానించాడు.

ఖర్గే వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. దాంతో ఛైర్మన్ జగదీప్ ధన్‌కడ్ కలుగజేసుకుని అధికార, ప్రతిపక్ష ఎంపీలను శాంతింపజేశారు. 'చంద్రశేఖర్ దేశంలోని గొప్ప నాయకుల్లో ఒకరు. ఆయనకున్న గౌరవం అమూల్యమైనది. ఆయన గురించి అగౌరవంగా మాట్లాడినందున ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి' అని ఖర్గేను కోరారు. చంద్రశేఖర్, తాను కలిసి అరెస్టయ్యామని, అందుకే ఆయన తన సమకాలికుడని చెప్పానని ఖర్గే బదులిచ్చారు. దాంతో ఛైర్మన్ స్పందిస్తూ.. 'కానీ మీరు 'నీ అయ్య' అనే పదం వాడారు. అలా మాట్లాడొచ్చా..? సాటి గౌరవ సభ్యుడితో మీరు నీ అయ్య అని వ్యాఖ్యానించారు. చంద్రశేఖర్ గారిని మనం గౌరవించాలి. కాబట్టి మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి' అని ఛైర్మన్ ధన్‌కడ్ మరోసారి ఖర్గేను కోరారు. కానీ ఖర్గే అందుకు ఒప్పుకోలేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురించి బీజేపీ సభ్యులు అగౌరవంగా మాట్లాడిన సందర్భాలను గుర్తుచేశారు. 'మన్మోహన్ సింగ్ స్నానం చేసేటప్పుడు కూడా రెయిన్ కోట్ వేసుకుంటారని ఒకరు అవమానించారు. ఒకరు ఆయన మాట్లాడనే మాట్లాడరని హేళన చేశారు. కొందరు ఆయనకు ప్రభుత్వాన్ని నడపడం చేతగాదని కించపర్చారు. వాళ్లు ఇంత అవమానించినా ఆయన సహించారు. దేశ ప్రయోజనాల కోసం మౌనంగా భరించారు. అందుకు కూడా ఆయనను మౌని బాబా అంటూ అగౌరవపర్చారు. ఇలా సాటి వ్యక్తులను అగౌరవపర్చే తత్వం వాళ్లది. మేం అవమానాలను సహించే వాళ్లం. చంద్రశేఖర్‌ను అవమానించే ఉద్దేశంతో నేను ఆ మాట అనలేదు' అని ఛైర్మన్ ధన్‌కఢ్‌కు ఖర్గే బదులిచ్చారు.

# అమెరికా నుంచి అక్రమ వలసదారులు వెనక్కి

**అమృత్‌సర్ చేరుకున్న విమానం**



**అమృత్‌సర్:** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 104 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా (USA) సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హరియాణా, 33 మంది గుజరాత్ వాసులతో పాటు మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఇద్దరు చండీగఢ్ వాసులు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తొలుత, విమానంలో 205 మంది స్వదేశానికి వస్తున్నట్లు వార్తలు రాగా.. ఇప్పుడు ఆ సంఖ్య 104 అని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వలసదారుల సంఖ్యపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు దిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు.

అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు పలువురిని తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

# 40 అడుగుల బావిలో పడిపోయిన భర్త

**కాపాడేందుకు భార్య సాహసం**



**పిరవమ్:** భర్త తన కళ్ల ముందే ప్రమాదానికి గురైతే ఆ భార్య కన్నీళ్లు పెట్టుకుంటూ కూర్చోలేదు. ప్రాణాలకు తెగించి ఆ భర్తను కాపాడుకుంది. బావిలో పడిపోయిన అతడిని గట్టిగా ఒడిసిపట్టి పునర్జన్మ ప్రసాదించింది. కేరళలోని పిరవమ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం..పిరవమ్ ప్రాంతంలో రమేశన్, పద్మ అనే దంపతులు నివసిస్తున్నారు. బుధవారం ఉదయం తమ నివాసంలోని మిరియాల చెట్టుపైకి ఎక్కి రమేశన్ (64) మిరియాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరగడంతో పక్కనే ఉన్న 40 అడుగుల లోతైన బావిలో పడిపోయాడు. వెంటనే స్పందించిన అతడి భార్య పద్మ (56) సమయస్ఫూర్తితో వ్యవహరించి..తాడు సహాయంతో బావిలోకి దిగింది. అయితే అప్పటికే స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్న భర్తను ఒడిపట్టుకొని దాదాపు 20 నిమిషాల పాటు అలాగే నీటిలో ఉంది. ఆమె కేకలు విని వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వల సహాయంతో వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు. తన భర్త ప్రాణాలను కాపాడుకోవడం కోసం పద్మ చూపిన తెగువను అధికారులు, స్థానికులు ప్రశంసించారు.

# ఢిల్లీలో ఆకట్టుకున్న అంతరిక్ష నేపథ్య పోలింగ్ కేంద్రం..

**ఓటర్లకు సహకరించిన వ్యోమగాములు**



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రం ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. అంతరిక్షం థీమ్‌తో ఈ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. వ్యోమగాముల డ్రెస్ ధరించిన వాలంటీర్లు ఓటర్లకు సేవలందించారు. ఢిల్లీలోని వికాస్‌పురిలో 'చంద్రయాన్ సే చునావ్ తక్ భారత్ కీ ఉడాన్' అనే థీమ్‌తో ప్రత్యేకమైన అంతరిక్ష నేపథ్యంతో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతరిక్షంలో భారత ప్రగతికి సంబంధించిన రాకెట్ ప్రయోగాలు వంటి నమూనాలు ఇందులో ఉంచారు.కాగా, వ్యోమగాముల మాదిరిగా డ్రెస్ ధరించిన వాలంటీర్లు ఇక్కడకు వచ్చిన ఓటర్లకు సేవలందించారు. అలాగే ఈ పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన టెలిస్కోప్‌లు, బయోస్కోప్‌లతో ఓటర్లు అద్భుతమైన అనుభవం, ఆనందం పొందారు. ప్రత్యేకమైన ఈ పోలింగ్ బూత్‌కు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ప్రతి ఏడాది దివ్యాంగ మహిళలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయం

- వివాహం వేళ అదానీ తనయుడి వినూత్న కార్యక్రమం



**ఢిల్లీ:** ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ఇంట పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన చిన్న కుమారుడు జీత్ అదానీ కి, దివా జైమిన్ షా తో ఫిబ్రవరి ఏడున వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో వారు పలు సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సమయంలో జీత్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గౌతమ్ అదానీ వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''జీత్, దివా పవిత్ర సంకల్పంతో వారి వైవాహిక జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. ప్రతి సంవత్సరం 500 మంది దివ్యాంగ సోదరీమణులకు వివాహం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది సంతోషకర విషయం. ఒక తండ్రిగా ఈ మంగళసేవ నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ ప్రయత్నం ద్వారా దివ్యాంగులైన ఆడబిడ్డలు, వారి కుటుంబాలు ఆనందం, గౌరవంతో ముందుకుసాగుతాయనే నమ్మకం కలుగుతోంది. ఈ సేవా మార్గంలో జీత్, దివా ముందుకు సాగేందుకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను'' అని అదానీ సంతోషం వ్యక్తంచేశారు. మంగళ సేవకు సంబంధించిన చిత్రాలను షేర్ చేశారు.

జీత్ అదానీ.. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా నుంచి ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ సైన్సెస్‌లో పట్టా పొందారు. 2019లో అదానీ గ్రూప్‌లో చేరారు. స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, క్యాపిటల్ మార్కెట్స్ వంటి విభాగాల బాధ్యతలు చూస్తున్నారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపారంతో పాటు అదానీ డిజిటల్ ల్యాబ్స్‌కు కూడా నాయకత్వం వహిస్తున్నారు. దివా.. గుజరాత్‌కు చెందిన ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె.ఫిబ్రవరి 7న నిరాడంబరంగా, సంప్రదాయ పద్ధతిలో జీత్ వివాహం జరగనుందని తెలుస్తోంది. ఎలాన్ మస్క్, బిల్ గేట్స్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను ఈ వివాహ వేడుకకు అదానీ ఆహ్వానిస్తున్నారని, టేలర్ స్విఫ్ట్ ప్రదర్శన ఉండబోతోందని సామాజిక మాధ్యమాల్లో ఇటీవల ప్రచారం జరిగింది. దీనిపై అదానీ ఇటీవల స్పష్టత ఇచ్చారు. అలాంటిది ఏమీ లేదని కుంభమేళాకు హాజరైన సందర్భంగా ఆయన వెల్లడించారు. 2023 మార్చిలో దివాతో జీత్ నిశ్చితార్థం అహ్మదాబాద్‌లో జరిగింది. పెళ్లి కూడా అహ్మదాబాద్‌లోనే జరిపించనున్నారు.

# నటుడు విజయ్ పార్టీలో ఆటో డ్రైవర్‌కు కీలక పదవి

**చెన్నై:** తమిళనాడుకు చెందిన ప్రముఖ సినీ నటుడు విజయ్ నెలకొల్పిన తమిళగ వెట్రీ కళగం పార్టీలో ఆటో డ్రైవర్‌కు కీలక పదవి దక్కింది. పార్టీ కోయంబత్తూరు సబర్బన్ ఈస్ట్ జిల్లా కార్యదర్శిగా బాబు అనే ఆటో డ్రైవర్ ను నియమించారు. నటుడు విజయ్ వీరాభిమాని అయిన బాబు తనకు పార్టీలో కీలకమైన పదవి ఇచ్చినందుకు ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.బాబుకు పార్టీ జిల్లా కార్యదర్శి పదవి దక్కిందని తెలుసుకున్న ఆయన స్నేహితులు, సన్నిహితులు, పార్టీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ బాబు మాట్లాడుతూ.. తాను విజయ్ అభిమాన సంఘమైన విజయ్ మక్కల్ ఇయక్కమ్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేశానని, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవాడినని చెప్పారు. పార్టీ ప్రారంభించిన తర్వాత సాధారణ కార్యకర్తగా కొనసాగుతున్నానని అన్నారు. ఈ నేపథ్యంలో తమ నేత విజయ్ తనకు జిల్లా శాఖ కార్యదర్శి పదవినివ్వడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు.

## షిర్డీలో చెలరేగిన దొంగలు.. ఇద్దరు ఆలయ ట్రస్ట్ ఉద్యోగులు మృతి, మరొకరికి గాయాలు

**ముంబై:** ప్రసిద్ధ సాయిబాబా ఆలయం ఉన్న షిర్డీలో దొంగలు చెలరేగిపోయారు. పలు ప్రాంతాల్లో దోపిడీకి యత్నించారు. ఈ నేపథ్యంలో సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు కత్తిపోట్లకు గురై మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్ర అహల్యానగర్ జిల్లాలోని షిర్డీలో ఈ సంఘటన జరిగింది. సోమవారం (ఫిబ్రవరి 3) తెల్లవారుజామున షిర్డీలోని పలు ప్రాంతాల్లోని ఇళ్లల్లో దొంగలు చొరబడ్డారు. దోపిడీకి యత్నించే క్రమంలో కొందరు వ్యక్తులపై కత్తులతో దాడి చేశారు.కాగా, సాయిబాబా ఆలయాన్ని నిర్వహించే ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులైన 43 ఏళ్ల సుభాష్ సాహెబ్రావ్ ఘోడే, 45 ఏళ్ల నితిన్ కృష్ణ షెజుల్, దొంగల కత్తిపోట్ల వల్ల మరణించినట్లు పోలీసులు తెలిపారు. శ్రీకృష్ణ నగర్‌కు చెందిన కృష్ణ దేహార్కర్‌పై కూడా ఆ దుండగులు కత్తితో దాడి చేయగా అతడు గాయపడినట్లు చెప్పారు. దొంగలు గంట వ్యవధిలో మూడు చోట్ల దాడులకు పాల్పడినట్లు వెల్లడించారు.మరోవైపు ఈ సంఘటనలకు సంబంధించి షిర్డీలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన కిరణ్ న్యాండియో సదా కులేను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. పలు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దోపిడీ కోసమే కత్తి దాడులు జరిగాయని, మరే ఇతర కారణాలు లేవని పోలీస్ అధికారి స్పష్టం చేశారు. నిందితులపై గతంలో కూడా పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

# వరుణ్‌ను తీసుకోవడం మంచిదే.. అలా మాత్రం చేయొద్దు: చోప్రా



వరుణ్ చక్రవర్తిని వన్డేల్లోకి తీసుకోవడం మంచి నిర్ణయమని భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా ప్రశంసించాడు. అయితే, అతడిని బెంచ్‌కే పరిమితం చేయొద్దని సూచించాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కించుకున్నాడు. దీంతో అతడిని చివరి క్షణంలో వన్డే సిరీస్‌కు మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకంగా ఉన్న ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రాణిస్తే ఐసీసీ టోర్నీలోకి ఎంట్రీ ఇవ్వడం ఖాయంగానే కనిపిస్తోంది. ''వరుణ్ చక్రవర్తి ఎంపిక అద్భుతం. నా టీమ్‌లో అతడికి చోటు కల్పించా. ఫింగర్ స్పిన్నర్ల అవసరం ఉండదు. కానీ, మణికట్టు మాంత్రికులే పెద్ద పాత్ర. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సెలక్టర్లు అతడిని ఎంపిక చేయలేదు. ఇప్పుడు వన్డేల్లోకి తీసుకున్నారు. అతడి ఫామ్‌ను ఉపయోగించుకోవానుకోవడం సరైన నిర్ణయం. అయితే, అతడిని బెంచ్‌కే పరిమితం చేయొద్దని కోరుతున్నా. ప్రతి మ్యాచ్‌లోనూ ఆడించాలి'' అని చోప్రా తెలిపాడు.

**షమీ విషయంలో..**

''ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జస్‌ప్రీత్ బుమ్రా, షమీని తీసుకున్నారు. అర్ష్‌దీప్ సింగ్ మూడో పేసర్. ఇక హార్దిక్ పాండ్య జట్టులో ఉన్నాడు. కానీ, బుమ్రాకు సంబంధించిన గుడ్‌న్యూస్ వచ్చేలా లేదు. అతడి ఫిట్‌నెస్‌పై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. పూర్తిగా తెలియకుండా మనం మాట్లాడుకోకూడదు. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీలో నలుగురు పేసర్లు 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉండాల్సిందే. కానీ, షమీ విషయంలో నాకు ఇంకా అనుమానాలు ఉన్నాయి. గత మ్యాచ్‌లో మూడు వికెట్లు తీశాడు. కానీ, వన్డేలకు అతడు పూర్తిగా సిద్ధమైనట్లు అనిపించడం లేదు. అందుకే, మరొక పేసర్‌ను స్క్వాడ్‌లోకి తీసుకోవాలని సూచిస్తున్నా. సిరాజ్ వెళ్లే అవకాశం ఉంది'' అని చోప్రా వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు బుమ్రాకు బ్యాకప్‌గా హర్షిత్ రాణాను బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం రిటైర్‌మెంట్‌పై రోహిత్ నిర్ణయం?



**ముంబయి:** మరో రెండు వారాల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మనాయకత్వంలో టీమ్ఇండియా బరిలోకి దిగనుంది. గతేడాది టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో టెస్టు సిరీస్ సమయంలోనూ సంచలన నిర్ణయం తీసుకుంటాడని వార్తలు వచ్చాయి. అయినా టెస్టులకు గుడ్‌బై చెప్పలేదు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీడ్కోలు నిర్ణయం తీసుకుంటాడని సమాచారం. మరోవైపు బీసీసీఐ కూడా భవిష్యత్తు సారథ్యంపై ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌తోపాటు వన్డే ప్రపంచ కప్ 2027 కోసం టీమ్‌ను సిద్ధం చేసేందుకు బీసీసీఐ సమాయత్తమవుతోంది. అందులో భాగంగా సీనియర్ల భవితవ్యంపై ఓ స్పష్టత కోరే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. రోహిత్‌తో పోలిస్తే విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ బాగుంటుందని.. మరికొన్నేళ్లు జాతీయజట్టుకు ఆడే అవకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికితే అతడి స్థానంలో రెండు ఫార్మాట్లకు కెప్టెన్లను నియమించాల్సి ఉంటుంది. టెస్టులకు జస్‌ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్ రేసులో ఉండగా.. వన్డేలకు శుభ్‌మన్ గిల్, పంత్ ఉన్నట్లు తెలుస్తోంది. యశస్వి జైస్వాల్‌కు సుదీర్ఘ ఫార్మాట్ బాధ్యతలు అప్పగించాలనేవారూ లేకపోలేదు. ''గత సెలక్షన్ కమిటీ సమావేశంలోనే రోహిత్‌తో సెలక్టర్లు, బీసీసీఐ బోర్డు సభ్యులు చర్చలు జరిపారు. కాస్త సమయం కావాలని రోహిత్ అప్పుడు చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవచ్చు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్‌తోపాటు వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని మేనేజ్‌మెంట్ ప్రణాళికలను సిద్ధం చేయనుంది. ప్రతిఒక్కరితో చర్చలు జరిపి భారత జట్టులో మార్పులు తీసుకురావాలనేది బోర్డు అభిమతం. సారథులుగా ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా సారథ్యంపై ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. గాయాల బెడద అతడికి సానుకూలంగా ఉండకపోవచ్చు. అందుకే, నిలకడగా ఉండే ప్లేయర్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. రిషభ్ పంత్ బలమైన అభ్యర్థి. అతడితోపాటు యశస్వి కూడా ఈ రేసులో ఉన్నాడు'' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

## ఇంగ్లండ్‌పై టాప్ లేపిన అభిషేక్.. ఐసీసీ ర్యాంకుల్లో నెంబర్ 2



**లండన్:** ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ అదరగొట్టాడు. తాజాగా ప్రకటించిన ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 38 స్థానాలను మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరాడు. ఇంగ్లండ్‌పై ఐదో టీ20లో సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అభిషేక్ 829 పాయింట్లతో ఉన్నాడు. ఇక అగ్రస్థానంలో సన్‌రైజర్స్ పార్టనర్, ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (855 పాయింట్లు) కొనసాగుతున్నాడు. వీరిద్దరి తర్వాత తిలక్ వర్మ (803), ఫిల్ సాల్ట్ (798), సూర్యకుమార్ యాదవ్ (738) ఉన్నారు.

**వరుణ్ కూడా..**

ఇంగ్లండ్‌పై ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన వరుణ్ చక్రవర్తికి ఐసీసీ ర్యాంకుల్లోనూ రివార్డు దక్కింది. మూడు స్థానాలను మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరాడు. విండీస్ బౌలర్ అకీల్ హుసేన్ (707) అగ్రస్థానంలో ఉండగా... అదిల్ రషీద్ (705), వరుణ్ చక్రవర్తి (705) పాయింట్లపరంగా ఒకే స్థానంలో ఉన్నప్పటికీ.. దశాంశంలో తేడాతో రషీద్ రెండులో నిలిచాడు. రవి బిష్ణోయ్ (671) నాలుగు ర్యాంకులు ఎగబాకి ఆరో ప్లేస్‌లో ఉన్నాడు.

**బుమ్రాదే అగ్రస్థానం..**

టెస్టుల్లోనూ బ్యాటింగ్, బౌలింగ్ ర్యాంకులను ఐసీసీ అప్‌డేట్ చేసింది. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా (908) అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. టాప్ -10లో బుమ్రా కాకుండా రవీంద్ర జడేజా కూడా ఉన్నాడు. జడ్డూ (745) తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక బ్యాటర్ల విషయానికొస్తే.. ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ (895) అగ్రస్థానంలో ఉన్నాడు. టాప్ -10లో కేవలం ఇద్దరు భారత బ్యాటర్లు మాత్రమే ఉన్నారు. యశస్వి జైస్వాల్ (847) నాలుగో ప్లేస్, రిషభ్ పంత్ (739) తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

## టీ20ల్లో రషీద్ ఖాన్ ప్రపంచ రికార్డు



**అఫ్గానిస్తాన్:** అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ ప్రపంచ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతోన్న SA20 లీగ్‌లో ఎంఐ కేప్‌టౌన్ జట్టుకు రషీద్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పార్ల్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో టీ20ల్లో (అంతర్జాతీయ + లీగ్‌లు) కలిసి 633 వికెట్లు పడగొట్టాడు. ఇందులో అఫ్గాన్ తరఫున 161 వికెట్లు తీశాడు. మిగిలిన 472 వికెట్లు దేశవాళీతోపాటు వివిధ లీగుల్లో పడగొట్టినవే.

భారత అభిమానులకూ సుపరిచితుడే..

అఫ్గానిస్థాన్ క్రికెటర్ రషీద్‌ఖాన్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. భారత్‌లోనూ ఎక్కువగానే ఫ్యాన్స్ ఉన్న సంగతి తెలిసిందే. మరీ ముఖ్యంగా తెలుగు క్రికెట్ అభిమానులకు సుపరిచితుడే. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చాన్నాళ్లు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతున్నాడు. ఇప్పుడు అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన రషీద్ ఖాన్.. 461 మ్యాచుల్లో 18.08 సగటుతో ఈ ఘనత సాధించాడు. వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో 582 మ్యాచుల్లో 24.40 సగటుతో 631 వికెట్లు పడగొట్టాడు. ''పదేళ్ల ముందు అసలు ఈ ఘనత సాధిస్తానని అనుకోలేదు. టేబుల్‌లో టాపర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది. డీజే (డ్వేన్ బ్రావో) టీ20ల్లో అత్యుత్తమ బౌలర్. అతడిని అధిగమించడం గౌరవంగా భావిస్తున్నా. ముమ్మందూ ఇలానే కొనసాగేందుకు ప్రయత్నిస్తా'' అని రషీద్ వెల్లడించాడు.

## నడిరోడ్డుపై ఆటో డ్రైవర్‌తో రాహుల్ ద్రవిడ్ వాగ్వాదం..

**ముంబయి:** టీమ్ ఇండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ నడిరోడ్డుపై ఓ ఆటో డ్రైవర్ తో వాగ్వాదానికి దిగారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది. మైదానంలో ఎంతో ప్రశాంతంగా కనిపించే ద్రవిడ్ ఇలా అసహనాన్ని ప్రదర్శించడంతో నెటిజన్లు షాక్ అవుతున్నారు.ఇంతకీ ఏం జరిగిందంటే.. రాహుల్ ద్రవిడ్ మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం సమీపంలో కన్నింగ్‌హామ్ రోడ్డులో తన కారులో ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో ద్రవిడ్ కారును ఓ ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. అయితే ద్రవిడ్ కారుకు స్వల్ప డ్యామేజీ అయ్యింది. దీంతో సహనం కోల్పోయిన ద్రవిడ్ వెంటనే కారు దిగి సదరు ఆటో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. కన్నడ భాషలో ఆటో డ్రైవర్‌పై అసహనాన్ని ప్రదర్శించాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.




## స్విగ్గీ క్యూ3 ఫలితాలు.. రూ.799 కోట్లకు పెరిగిన నష్టం

**ఢిల్లీ:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్లాట్‌ఫామ్ నష్టం రూ.799 కోట్లుగా నమోదైందని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.574 కోట్లతో పోలిస్తే నష్టం 39 శాతం పెరిగినట్లు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయం 31 శాతం వృద్ధితో రూ.3,049 కోట్ల నుంచి రూ.3,993 కోట్లకు పెరిగిందని కంపెనీ తెలిపింది.తమ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా బోల్ట్, స్నాక్ పేరిట 10 నిమిషాల డెలివరీ సేవల్ని ప్రారంభించామని కంపెనీ సీఈఓ శ్రీహర్ష మజేటీ అన్నారు. వీటితో పాటు రెస్టరంట్, ఈవెంట్ రిజర్వేషన్ల కోసం స్విగ్గీ సెన్సస్, స్విగ్గీ ప్రీమియం సేవల కోసం వన్ బ్లాక్ సబ్‌స్క్రిప్షన్ ప్రోగ్రామ్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. ఫుడ్ డెలివరీ విభాగం ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్విక్ కామర్స్ వ్యాపార విస్తరణకు, మార్కెటింగ్‌తో వినియోగించినట్లు తెలిపారు. ఒక్క జనవరిలోనే 86 ఇన్‌స్టామార్ట్ స్టోర్లను జోడించినట్లు ఆయన తెలిపారు. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ ముగిసే సమయానికి స్విగ్గీ షేరు విలువ 3.56 శాతం నష్టంతో రూ.418.60 వద్ద ముగిసింది.

స్విగ్గీ గ్రాస్ ఆర్డర్ వాల్యూ వార్షిక ప్రాతిపదికన 38 శాతం పెరిగి రూ.12,165 కోట్లకు చేరింది.


ఫుడ్ డెలివరీ బిజినెస్‌లో గ్రాస్ ఆర్డర్ వాల్యూ 19.2 శాతం పెరిగి రూ.7,436 కోట్లుగా ఉంది.

ఇన్‌స్టామార్ట్ జీఓవీ ఏకంగా 88 శాతం పెరిగి రూ.3,907 కోట్లుగా నమోదైంది.

## రతన్ టాటా స్నేహితుడు శంతను నాయుడుకు టాటా మోటార్స్‌లో కీలక పదవి



**ముంబయి:** దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటాకు అత్యంత ఆప్తుడు, టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైన జనరల్ మేనేజర్‌గా, అసిస్టెంట్‌గా వ్యవహరించిన శంతను నాయుడుకు సంస్థలో కీలక పదవి వరించింది. రతన్ టాటా మరణానంతరం శంతనుకు టాటా గ్రూప్ కీలక బాధ్యతలు అప్పగించింది. దేశీయ దిగ్గజ ఆటో మొబైల్ సంస్థ టాటా మోటార్స్‌లో స్ట్రాటజిస్ట్ ఇనీషియేటివ్స్ విభాగానికి హెడ్, జనరల్ మేనేజర్‌గా నియమించింది. ఈ విషయాన్ని శంతను నాయకుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'టాటా మోటార్స్‌లో జనరల్ మేనేజర్, హెడ్- స్ట్రాటజిక్ ఇనీషియేటివ్‌గా కొత్త ప్రయాణం మొదలు పెట్టినందుకు సంతోషంగా ఉంది. మా నాన్న టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి తెల్ల చొక్కా, నేవీ ప్యాంట్ వేసుకుని ఇంటికొచ్చేవారు. ఆయన కోసం కిటికీ వద్ద నిలబడి ఎదురు చూసేవాడిని. ఇప్పుడు లైఫ్ ఫుల్ సర్కిల్‌లోకి వచ్చింది' అంటూ లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో శంతను నాయుడు రాసుకొచ్చారు. కాగా, 80 ఏళ్ల రతన్ టాటాకు.. శంతనుతో మంచి అనుబంధం ఏర్పడింది. 2018 నుంచి రతన్ టాటాకు శంతను అసిస్టెంట్‌గా ఉంటున్నారు. వీరిద్దరినీ కలిపింది వీధి శునకాలే. రతన్ టాటా, శంతను మధ్య భారీగా వయోబేధం ఉన్నా.. అది స్నేహానికి, వ్యాపారానికి ఏమాత్రం అడ్డుకోలేదు. ఒకరిపై మరొకరు చేతులు వేసుకుని మాట్లాడేంత సాన్నిహిత్యం ఏర్పడింది. వీరిద్దరి బంధాన్ని అర్థం చేసుకున్నవారు 'ఏజ్.. జస్ట్ ఎ నంబర్' అని తేల్చేస్తారు. వ్యాపారంతోపాటు సామాజిక సేవలోనూ పరిచయం అక్కర్లేని పేరు రతన్ టాటాది. అలాంటి వ్యాపార దిగ్గజం భుజంపై చేయి వేసి 'ఇంకేంటి డ్యూడ్! ట్విటర్‌లో ఏం ట్వీటావు? ఇన్‌స్టాలో ఫాలోవర్స్ సంగతేంటి?' అంటూ ఆప్యాయంగా పలకరించేంత చనువు, స్నేహం శంతనుకు మాత్రమే ఉంది. రతన్ సేవా కార్యక్రమాలు, ఆయన సోషల్ మీడియా ఖాతాల వెనుక ఈ 30 ఏండ్ల యువకుడి ప్రతిభా నైపుణ్యాలు ఉన్నాయి. రతన్ టాటా చివరి దశలో కేర్ టేకర్‌గా కూడా శంతను నాయుడు వ్యవహరించారు.



## రూ.20 లక్షల జాబ్‌పై జొమాటో సీఈఓ అప్‌డేట్

**ముంబయి:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ పొజిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను ఆయన సోషల్‌మీడియా వేదికగా పంచుకున్నారు. తమ వద్దకు వచ్చిన 18 వేలకు పైగా అప్లికేషన్లలో 30 మందికి జాబ్ ఆఫర్లు అందించామని ఆయన తెలిపారు. తమతో కలిసి పనిచేసేందుకు ఎవరూ డబ్బు చెల్లించలేదని గోయల్ పేర్కొన్నారు. ''మా వద్దకు వచ్చిన అప్లికేషనల్లో వడపోసి 150 మందిని ఎంపిక చేశాం. వారిలో 30 మందికి జాబ్ ఆఫర్లు అందించాం. అందులో 18 మంది ఇప్పటికే జొమాటో (బ్లింకిట్‌తో సహా) గ్రూప్‌లో అత్యున్నత స్థాయి హోదా కల్పించాం. వారు చేస్తున్న పనికి తగ్గట్లు వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నాం. మాతో కలిసి పనిచేసేందుకు ఎవరూ డబ్బు చెల్లించలేదు'' అని దీపిందర్ గోయల్ అన్నారు. ప్రస్తుతం జొమాటోలో చేరిన వారిలో నలుగురు నేరుగా తనతో కలిసి పనిచేస్తున్నారని గోయల్ అన్నారు. వీరిలో ఇద్దరు చీఫ్ పొజిషన్లలో ఉన్నారని వెల్లడించారు. అయితే ఇది కేవలం ఒకసారి జరిపే నియామక ప్రక్రియ కాదని తెలిపారు. తమ వద్దకు వచ్చిన 18వేల మందికి పైగా అప్లికేషన్లలో నైపుణ్యం ఉన్న వారి కోసం ఇంకా అన్వేషిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన వ్యక్తుల్ని సంస్థలో నియమించుకోనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుందని ఆయన తెలిపారు. జొమాటో గ్రూప్ సంస్థల్లో చీఫ్ ఆఫ్ స్టాఫ్ పొజిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు ఎంపికైన వారికి ఎలాంటి వేతనమూ చెల్లించబోమని, అభ్యర్థే తిరిగి ₹20 లక్షలు చెల్లించాలన్న షరతు విధించారు. ఆ జాబ్ ఆఫర్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశంపై గోయల్ స్పందించారు. కేవలం వడపోత కోసమే నగదు చెల్లించాలనే నిబంధన పెట్టినట్లు స్పష్టం చేశారు. నగదు చెల్లించగల ఆర్థిక స్తోమత ఉన్నవారి దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు.

# వన్నె తగ్గని పసిడి.. 5శాతం పెరిగిన డిమాండ్

**ముంబయి:** దిగుమతి సుంకం తగ్గించడంతో దేశంలో బంగారానికి గిరాకీ పెరిగింది. దీనికి తోడు పెళ్లిళ్లు, పండగ సీజన్ కారణంగా 2024లో పసిడి డిమాండ్ 5శాతం పెరిగి 802.5 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడించింది. ఈ ఏడాదిలోనూ పుత్తడి గిరాకీ ఇదే స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది.2024 ఏడాదికిగానూ ప్రపంచవ్యాప్తంగా పసిడి వినియోగంపై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం గణాంకాలు విడుదల చేసింది. దాని ప్రకారం, 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుగా ఉండగా.. గతేడాది ఆ మొత్తం 802.8 టన్నులకు పెరిగింది. ''2025లో బంగారం గిరాకీ 700-800 టన్నులు ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. అయితే, ఈ ఏడాది ధరల్లో కొంత స్థిరత్వం వచ్చే అవకాశం ఉంది. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారు ఆభరణాల కొనుగోళ్లు పెరగొచ్చు'' అని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ సచిన్ జైన్ వెల్లడించారు. దిగుమతి సుంకాలు తగ్గించినప్పటికీ గత ఏడాది కాలంలో దేశీయ మార్కెట్లో పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. కొన్ని నగరాల్లో పది గ్రాముల పుత్తడి ఏకంగా రూ.86వేల పైన పలుకుతోంది. మరోవైపు, గతేడాది బంగారంలో పెట్టుబడులు 29శాతం పెరిగి 239.4 టన్నులకు చేరినట్లు జైన్ తెలిపారు. 2013 తర్వాత పసిడి పెట్టుబడుల్లో ఇదే అత్యధికం కావడం విశేషం. 2023లో ఈ మొత్తం 185.2 టన్నులుగా ఉంది.ఇక, గతేడాది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఏకంగా 73 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు జైన్ వెల్లడించారు. 2023లో కొనుగోలు చేసిన 16 టన్నులతో పోలిస్తే ఇది ఏకంగా నాలుగు రెట్లు కావడం గమనార్హం. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను పరిగణనలోకి తీసుకొని రిస్కును తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర బ్యాంకు బంగారం నిల్వలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# నా జీవితంలో అసూయకు తావులేదు: సమంత

హైదరాబాద్: తన మాజీ భాగస్వామి కొత్త బంధంలోకి అడుగుపెట్టడంపై నటి సమంత మాట్లాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు రిలేషన్‌షిప్ నుంచి బయటకు వచ్చి జీవితంలో ముందుకు సాగడంపై ప్రశ్న ఎదురైంది. దీనిపై స్పందిస్తూ.. ''దాని నుంచి బయటకు వచ్చేందుకు ఎంతో శ్రమించాను'' అని బదులిచ్చారు. అనంతరం విలేకరి.. ''మాజీ భాగస్వామి కొత్త బంధంలోకి అడుగుపెట్టినందుకు మీరు ఏమైనా అసూయ పడుతున్నారా'' అని ప్రశ్నించగా.. '' నా జీవితంలో అసూయకు తావులేదు. నా జీవితంలో అది భాగం కావడాన్ని కూడా అంగీకరించను. అసూయే అన్ని చెడులకు మూలమని భావిస్తా'' అని సమాధానం చెప్పారు. అలాంటి వాటి గురించి తాను పెద్దగా ఆలోచించనని అన్నారు.

మాజీ భాగస్వామి గురించి సమంత మాట్లాడటం ఇదేమీ తొలిసారి కాదు. 'సిటడెల్: హనీ బన్నీ' ప్రమోషన్స్‌లోనూ ఆమె మాట్లాడారు. ''అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చుపెట్టారు?'' అని ఆ ప్రాజెక్ట్ కోస్టార్ వరుణ్ ధావన్ ప్రశ్నించగా ''నా మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకలు'' అని బదులిచ్చారు సమంత. ''ఎంత ధర ఉంటుంది?'' అని అడగ్గా ''కాస్త ఎక్కువే.. ఇక కొనసాగిద్దాం'' అంటూ ముగించారు. అయితే ఆ వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. అంతకుముందు కరణ్ జోహార్ షోలో మాట్లాడుతూ తను, మాజీ ఒకే గదిలో ఉంటే.. దగ్గరలో కత్తులు ఉండకపోవడం మంచిది అని అన్నారు. వర్క్ లైఫ్ విషయానికి వస్తే.. సమంత ఇటీవల 'సిటడెల్: హనీ బన్నీ' ప్రాజెక్టుతో అలరించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రాజెక్టులో వరుణ్ ధావన్, సమంత జంటగా నటించారు. 80-90ల కాలంలో సమాజంలో మహిళల పరిస్థితి ఏంటనేది అందులో చూపించారు. హనీ పాత్రలో సమంత మెప్పించారు. కుమార్తె నదియాను రక్షించుకొనే తల్లి పాత్రలో కన్పించారు. స్వీయ నిర్మాణంలో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను కొన్ని నెలల క్రితం అనౌన్స్ చేశారు. దీంతోపాటు 'రక్త్ బ్రహ్మాండ్' అనే సిరీస్‌లోనూ నటిస్తోంది.



# రూ.100 కోట్లు నష్టపోయా.. హీరోలు పట్టించుకోలేదు

**నిర్మాత శింగనమల రమేష్ బాబు**



**హైదరాబాద్:** 'కొమరంపులి', 'ఖలేజా' వంటి తెలుగు చిత్రాలను నిర్మించిన నిర్మాత శింగనమల రమేష్ బాబు ఓ కేసు విషయంలో దాదాపు 75 రోజుల పాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన 14 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టివేసింది. ఈ క్రమంలోనే ఆయన చాలా ఏళ్ల తర్వాత తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ న్యాయ పోరాటంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి, తాను గతంలో నిర్మించిన చిత్రాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి మాట్లాడారు.

**ప్రశ్న: మీపై కేసు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు?**

**రమేష్ బాబు:** నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. చావో బతుకో న్యాయపరంగానే పోరాటం చేస్తా.

**ప్రశ్న: భవిష్యత్తులో నిర్మాతగా కొనసాగుతారా?**

**రమేష్ బాబు:** నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. నాకు ఉన్న అభిరుచితో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. విజయాన్ని అందుకున్నారు. భవిష్యత్తులో దర్శక రంగంలోకి అడుగుపెట్టాలనుకుంటున్నారు. నేను కూడా నిర్మాతగా చేస్తా. ఫైనాన్షియర్‌గా చేస్తాను.

**ప్రశ్న: మీ మీద కేసు పెట్టింది ఎవరు? వాళ్లకు సినీ రంగంతో సంబంధం ఉందా?**

**రమేష్ బాబు:** నాపై కేసు పెట్టిన వాళ్లు ఇండస్ట్రీ చెందిన వారు కాదు. కానీ, నేను తప్పుడు కేసులో ఇరుక్కున్నప్పుడు ఏ ఒక్క హీరో నాకు ఫోన్ చేయలేదు. ఎలా ఉన్నావని పలకరించలేదు.

**ప్రశ్న: అగ్ర హీరోల చిత్రాలను నిర్మించి నష్టపోయారా? ఆ సమయంలో హీరోలు ఏమైనా సపోర్ట్ చేశారా?**

**రమేష్ బాబు:** అప్పట్లో చిత్రాలు ఆరు నెలలు, లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్ది నేను తెరకెక్కించిన కొన్ని అగ్రహీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ల సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా. ఆ సమయంలో ఎవరూ నాకు సపోర్ట్ చేయలేదు.

**ప్రశ్న: అసలు మీపై పెట్టిన కేసు ఏమిటి?**

**రమేష్ బాబు:** రూ.14 కోట్లు మోసం చేశానని నాపై అభియోగాలు వచ్చాయి. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని కేసు పెట్టారు. సుదీర్ఘంగా న్యాయ విచారణ జరిగింది. ఆధారాలు లేకపోవడంతో న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. ఇప్పటికీ ఆ ఆస్తులు నా పేరు మీదే ఉన్నాయి.

**ప్రశ్న:జైలుకు వెళ్లే సమయానికి మీరు ఫైనాన్షియర్‌గా కూడా చేస్తున్నారు. అప్పుడు ఎవరైనా డబ్బులు ఎగ్గొట్టారా?**

**రమేష్ బాబు:** పేర్లు చెప్పాలనుకోవడం లేదు. కానీ కొంతమంది నిర్మాతలు డబ్బులు ఇవ్వలేదు.

ప్రశ్న: మీ జీవితంపై సినిమా చేస్తారా?

రమేష్ బాబు: అలాంటి ఉద్దేశం లేదు. నా జీవితాన్ని తెరకెక్కిస్తే ఎవరు చూస్తారు..! (నవ్వులు).

# ఒక మంచి వ్యక్తిని కోల్పోయా..

**రిలేషన్‌షిప్ స్టేటస్‌పై పార్వతీ తిరువోతు**

విషయం ఏదైనా తన అభిప్రాయాలను సూటిగా చెప్పేస్తుంటారు నటి పార్వతీ తిరువోత్తు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను ఒక వ్యక్తిని ఇష్టపడ్డానని.. విపరీతమైన కోపం వల్లే ఆ బంధం ఎంతో కాలం కొనసాగలేదని ఆమె చెప్పారు. ''గతంలో నేనొక వ్యక్తితో డేట్‌లో ఉన్నాను. అతడు ఎంతో మంచి వాడు. అద్భుతమైన వ్యక్తి. అయితే నాకు విపరీతమైన కోపం ఉండేది. ఆకలికి తట్టుకోలేక కోప్పడిన సందర్భాలు ఉన్నాయి. దాని వల్ల మా బంధం ఎంతోకాలం కొనసాగలేదు. అలా, మేమిద్దరం విడిపోయాం. కొంతకాలానికి అనుకోకుండా అతడిని కలిశాను. క్షమాపణలు కూడా చెప్పా. అతడితో రిలేషన్, బ్రేకప్ నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. ఏదైనా బంధంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలనే విషయాన్ని తెలుసుకున్నా'' అని ఆమె చెప్పారు. రిలేషన్ నుంచి బయటకు వచ్చేసినప్పటికీ వారితో తాను సత్సంబంధాలు కలిగి ఉన్నానని అన్నారు. అనంతరం మూడేళ్ల నుంచి తాను సింగిల్‌గానే ఉన్నట్లు వివరించారు. చిత్ర పరిశ్రమకు చెందిన దర్శక నిర్మాతలు, నటులతో కాకుండా టెక్నిషియన్స్‌తో గతంలో రిలేషన్‌లో ఉన్నానని ఆమె చెప్పారు.అనంతరం తాను డేటింగ్ యాప్‌లో ఉన్నానని పార్వతీ తిరువోతు పేర్కొన్నారు. వీలు కుదిరినప్పుడు ఆ యాప్స్‌ను తాను చెక్ చేస్తుంటానని అన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని ప్రేమలో పడితే అది ఎంతోకాలం కొనసాగుతుందని తాను భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. 'దూత' వెబ్ సిరీస్‌తో పార్వతీ తిరువోతు తెలుగు వారికి చేరువైన విషయం తెలిసిందే. ఇటీవల ఆమె 'తంగలాన్'తో అలరించారు.

# ఒత్తిడితోనే గొప్ప సినిమాలను అందిస్తోంది

**మలయాళ ఇండస్ట్రీపై పృథ్వీరాజ్ కామెంట్స్**

నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా మలయాళ ఇండస్ట్రీలో ఒత్తిడి గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్'. ఈ సినిమా ప్రచారంలో బిజీగా ఉన్న పృథ్వీరాజ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. మలయాళ ఇండస్ట్రీకు బాక్సాఫీసు నంబర్లు ఎంతో ముఖ్యమన్నారు.

''మలయాళంలో సినిమాలకు లాభాలు రావడానికి చాలా ఒత్తిడి ఉంటుంది. అంత ఒత్తిడి ఉన్నప్పటికీ పరిశ్రమ గొప్ప సినిమాలను అందిస్తోంది. మంచి కథలు కాకపోతే కచ్చితంగా ఆదరణకు నోచుకోవని ప్రేక్షకులు ఇప్పటికే ఎన్నోసార్లు నిరూపించారు. ఈ విషయంలో వాళ్లకు కృతజ్ఞతలు చెప్పాలి. గతకొంత కాలంగా నటీనటులు ఎవరు? దర్శకుడు ఎవరు? అనే దానితో సంబంధం లేకుండా మంచి సినిమాలు భారీ కలెక్షన్లను సొంతం చేసుకుంటున్నాయి. మేము విజయం సాధించామనడానికి ఇదే నిదర్శనం. కథ బాగుంటే హీరో ఎవరనేదానితో సంబంధం లేకుండా సినిమాలు హిట్ అవుతాయి. మంచి కథను ఎంచుకుంటే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం మాకు కలిగింది. మన పనికి మనం కట్టుబడి ఉంటే తర్వాత ఫలితాన్ని ఆడియన్స్ అందిస్తారు'' అని పృథ్వీరాజ్ సుకుమారన్ చెప్పారు. ప్రస్తుతం పృథ్వీరాజ్ సుకుమారన్ 'లూసిఫర్2: ఎంపురాన్' ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'లూసిఫర్'.

# వ్యాపారవేత్తగా కంగనా రనౌత్.. కల నెరవేరిందంటూ పోస్ట్

**ముంబయి:** బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ వ్యాపారరంగంలోకి అడుగుపెట్టారు. ఫుడ్ బిజినెస్ మొదలుపెడుతున్నానని తెలియజేస్తూ తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. 'ది మౌంటైన్ స్టోరీ' పేరుతో హిమాలయాల్లో కేఫ్ ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి 14 నుంచి ఇది ప్రారంభం కానుంది. ఈమేరకు రెస్టారంట్ ఫొటోలను నెటిజన్లతో పంచుకున్నారు. సంప్రదాయ హిమాచల్ ఫుడ్‌ను మోడ్రన్ అభిరుచులకు అనుగుణంగా అందించడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటుచేశానని తెలిపారు.''నా చిన్ననాటి కల ఎట్టకేలకు ప్రాణం పోసుకుంది. హిమాలయాల ఒడిలో నా చిన్న కేఫ్. ది మౌంటెన్ స్టోరీ.. ఇదొక ప్రేమకథ'' అని ఆమె పేర్కొన్నారు. ఫుడ్ బిజినెస్‌లో ఇప్పటికే పలువురు తారలు రాణిస్తున్నారు. శిల్పాశెట్టి, మలైకా అరోరా, మౌనీరాయ్, రకుల్ ప్రీత్ సింగ్ వంటి తారలకు రెస్టారంట్లు ఉన్నాయి.వర్క్ లైఫ్ విషయానికి వస్తే.. కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' ఇటీవల విడుదలైంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారం చేసుకొని ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇందిరాగాంధీగా కంగనా, జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని జనవరి 17న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ప్రస్తుతం ఆమె మాధవన్‌తో సినిమా చేస్తున్నారు.



# అలాంటి పాత్రలో బాలకృష్ణ చేయడమే విచిత్రం: పరుచూరి గోపాలకృష్ణ

సినీ రంగానికి బాలకృష్ణ చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఆనందం వ్యక్తంచేశారు. పరుచూరి పలుకుల్లో భాగంగా ఓ ప్రత్యేక వీడియో విడుదల చేశారు.''పద్మ పురస్కారాలు సామాన్యమైనవి కావు. బాలకృష్ణ కేవలం ఒక నటుడిగానే ఇది సాధించలేదు. ఆయన చేసిన సమాజసేవ, ప్రజా సేవలకు గాను ఈ అవార్డు వరించింది. 50 ఏళ్ల కిత్రం తొలిసారి మేకప్ వేసుకున్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు నటుడిగా అంచెలంచెలుగా ఎదుగుతూనే ఉన్నారు. 2014 నుంచి రాజకీయ సేవ చేస్తున్నారు. హిందూపురంలో ఆయన ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేస్తున్నారో అందరికీ తెలిసిందే. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతోమందికి ఆయన ప్రాణదానం చేస్తున్నారు. ఈ మూడు సేవల కారణంగానే ఆయనకు ఈ అవార్డు వరించిందని నా అభిప్రాయం''. ''ఒక నటుడిగా బాలకృష్ణ ఎన్నో జానర్ సినిమాల్లో చేశారు. ఈ మధ్యకాలంలో అన్నీ జానర్‌లలో నటించేవారు తక్కువమంది ఉన్నారు. ఆయన సినీ ప్రయాణంలో ఎన్నో గొప్ప విజయాలు చూశారు. చాలా సినిమాలు కమర్షియల్‌గా విజయాన్ని అందుకున్నాయి. 'ఆదిత్య 369'తో అద్భుతాన్ని సృష్టించారు. అలాగే 'సమరసింహారెడ్డి' తెలుగు సినీరంగంలో ఓ సంచలనం.



ఫ్యాక్షన్ సినిమాలకు ఓ బాట చూపించిన చిత్రమది. ఆయన్ని అలాంటి పాత్రలో చూపించడానికి చాలా భయపడ్డాం. కానీ, ఊహించిన దానికంటే విజయం సాధించింది. 'తిరుపతి వెంకటేశ్వర కల్యాణం'లో బాలకృష్ణ నారదుడిగా చేశారు. అలాంటి పాత్రలో ఆయన్ని ఊహించుకోవడమే ఒక విచిత్రం. నందమూరి తారకరామారావు చేసినట్లే ఎన్నో జానర్‌లలో గొప్ప పాత్రలు వేశారు. ఇప్పటికి మూడుసార్లు నంది అవార్డు తీసుకున్నారు. ఇక బసవతారకం ఆసుపత్రి ద్వారా సమాజ సేవ చేస్తున్నారు. మరోవైపు రాజకీయంగానూ తన మార్క్ చూపించారు. మచ్చలేని రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. అలాంటి వ్యక్తికి పద్మభూషణ్ వచ్చిందంటే ఎంతో ఆనందంగా ఉంది'' అని అన్నారు.

**ఎన్టీఆర్‌కు భారతరత్న.. ఎంతోమంది కల: పరుచూరి**

నందమూరి తారకరామారావుకు భారతరత్న రావాలని కోట్ల మంది తెలుగువారు కోరుకుంటున్నారని పరుచూరి అన్నారు. ఆయనలాంటి మహానుభావుడికి పేరు ముందు భారతరత్న ఎప్పుడు చేరుతుందా అని ఎంతోమంది ఎదురుచూస్తున్నారని తెలిపారు.

# రోజూ పరగడుపున దాల్చిన చెక్క నీళ్లు తాగితే.. అద్భుత ప్రయోజనాలు మీ సొంతం..!

ప్రతి వంటింట్లో అందరికీ అందుబాటులో ఉండే దాల్చిన చెక్కతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? ఇది ఆహారం రుచిని పెంచడమే కాదు.. ఆరోగ్యపరంగా అద్భుతమైన ప్రయోజనాలు కలిగిస్తుంది. అయితే దాల్చిన చెక్క పొడి రూపంలోనే కాదు.. నీళ్లలో మరిగించి తాగడం వల్ల కూడా అంతే అద్భుతమైన ఆరోగ్యప్రయోజనాలు పొందవచ్చు అంటున్నారు నిపుణులు. అందుకే ఆయుర్వేద ఔషదాల్లో తప్పనిసరిగా వాడుతుంటారు. ఆయా లాభాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.


శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దీనికోసం పోషకమైన వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. ఇందులో దాల్చిన చెక్క కూడా ఒకటి. దాల్చిన చెక్కలో తగినంత మొత్తంలో కాల్షియం, ఫైబర్, యాంటీవైరల్, యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దాల్చిన చెక్క నీరు తాగడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి.దాల్చిన చెక్కలో ఫైబర్ ఉంటుంది. ఉదయం దాని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. దీనితో పాటు, కడుపులో గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం వంటి సమస్యలు తొలగిపోతాయి. ఇది మీ శరీరం రోజంతా ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. వేగవంతమైన జీవక్రియ ద్వారా బరువు తగ్గాలనుకునేవారికి దాల్చిన చెక్క ప్రయోజనకరంగా ఉంటుంది.

దాల్చిన చెక్క నీటిలో యాంటీఆక్సిడెంట్, యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అంటు వ్యాధులు, వ్యాధుల నుండి మీ శరీరాన్ని కాపాడుతుంది. దాల్చిన చెక్క నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చు. దీన్ని తాగడం వల్ల శరీరంలో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉండదు.



దాల్చిన చెక్క నీరు మధుమేహ రోగులకు దివ్యౌషధం. దీన్ని తాగడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలోకి వస్తుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో కూడా సహాయపడుతుంది. ఉదయం దాల్చిన చెక్క నీరు తాగడం వల్ల శరీరానికి రోజంతా శక్తి లభిస్తుంది. దీన్ని తాగడం వల్ల అలసట, బలహీనత తగ్గుతాయి. ఇది కాకుండా, ఇది కీళ్ల నొప్పుల నుండి కూడా ఉపశమనం ఇస్తుంది.

దాల్చిన చెక్క నీరు తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కేలరీలు బర్న్ అవ్వడానికి, బరువు తగ్గడానికి దారితీస్తుంది. అంతేకాదు, దాల్చిన చెక్క మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది అభిజ్ఞా పనితీరు, జ్ఞాపకశక్తి, శ్రద్ధను మెరుగుపరుస్తుంది. అల్జీమర్స్ వ్యాధి వంటి వ్యాధుల ప్రమాదాన్ని దరి చేరకుండా చేస్తుంది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com